ప్రజాశక్తి

శనివారం 5 జులై 2025 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

మంత్రులు, మెజార్టీ ఎమ్మెల్యేల డుమ్మా

- అన్ని ప్రశ్నలకూ ఎంపీ శ్రీకృష్ణదేవరాయులు నుండే సమాధానం
- కల్తీ విత్తనాలు, తెగుళ్లపై ధ్వజమెత్తిన సభ్యులు
- సాదాసీదాగా జెడ్‌పి సమావేశం



ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

మూడు నెలలకు ఒకసారి జరిగే జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఉమ్మడి జిల్లాకు చెందిన కేంద్ర మంత్రి సహా ముగ్గురు రాష్ట్ర మంత్రులు, పలువురు ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎంపిలు, ఒక రాజ్యసభ సభ్యులు గైర్హాజరయ్యారు. కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రులు నారా లోకేష్, నాదెండ్ల మనోహర్, అనగాని సత్యప్రసాద్, బాపట్ల ఎంపి తెన్నేటి కృష్ణప్రసాద్, రాజ్యసభ సభ్యులు అయోధ్య రామిరెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సమావేశానికి రాలేదు. ఎమ్మెల్సీలు చంద్రగిరి ఏసురత్నం, మర్రి రాజశేఖర్, ఆలపాటి రాజేంద్ర ప్రసాదు, ప్రభుత్వ చీఫ్‌విప్ జి.వి.ఆంజనేయులు, ఎమ్మెల్యేలు కన్నా లక్ష్మీనారాయణ, ధూళిపాళ్ల నరేంద్ర, జూలకంటి బ్రహ్మారెడ్డి, నక్కా ఆనందబాబు, బాష్యం ప్రవీణ్ మాత్రమే హాజరయ్యారు. జెడ్‌పి చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా అధ్యక్షతన జరిగిన సమావేశంలో సభ్యుల ప్రశ్నలకు ప్రభుత్వం తరుపున తగిన సమాధానం చెప్పేవారు కరువయ్యారు. ఎక్కువ ప్రశ్నలకు నర్సరావుపేట ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయులు సమాధానం చెప్పారు. అన్నదాత సుఖీభవ గతేడాది ఇవ్వలేదని, ఈ ఏడాది ఎప్పుడు ఇస్తారన్న జెడ్‌పిటిసిల ప్రశ్నకు ఎవ్వరూ స్పష్టమైన సమాధానం చెప్ప లేకపోయారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే పిఎం కిసాన్ నిధులతో కలిపి మూడు విడతలుగా ఇస్తామని ఎంపి శ్రీకృష్ణదేవరాయులు చెప్పారు. మొదటి విడత సాయం ఈనెలాఖరులోగా రైతుల ఖాతాల్లో జమ అవుతాయన్నారు. గతేడాది పెట్టుబడి సాయం కూడా కలిపి ఇస్తారా అని కో-ఆప్షన్ సభ్యుడు షేక్ అమ్జిన్ ప్రశ్నించగా ఈ ఏడాది నుంచి అన్ని పథకాలు అమలులోకి వస్తాయని జి.వి.ఆంజనేయులు అన్నారు.

పరికపూడిసెల ఎత్తిపోతల పనులను వెంటనే ప్రారంభించాలని రొంపిచర్ల జెడ్‌పిటిసి పి.ఓబులరెడ్డి కోరారు. అటవీశాఖకు ప్రభుత్వం నుంచి రూ.14.80 కోట్లు చెల్లించాల్సి ఉందని జలవనరుల శాఖ అధికారులు తెలిపారు. ఈ పథకం జాప్యానికి నిధుల కొరత కారణమని, ఈ ఏడాది పనులు ప్రారంభిస్తామని ఎంపి శ్రీకృష్ణదేవరాయులు తెలిపారు. దీనికి కేంద్రం సాయం కోరాలని ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం సూచించారు. వ్యవసాయ సీజన్ ప్రారంభం నేపథ్యంలో నకిలీ విత్తనాలు, నాణ్యత లేని ఎరువులు, పురుగు మందులు అమ్మకాలు లేకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని వ్యవసాయ అధికారులను జి.వి.ఆంజనేయులు

2లో

జెడ్‌పి పద్దులకు ఆమోదం

గతంలో స్టాండింగ్ కమిటీలో తీసుకున్న జమా ఖర్చులకు సంబంధించిన గణాంకాలకు తాజా జెడ్‌పి సమావేశంలో ఆమోదం తెలిపారు. రూ.11.40 కోట్లకు ముందస్తు ఆమోదం లేకుండా ఏకపక్షంగా ఖర్చు చేసి సర్వసభ్య సమావేశం ఆమోదం కోసం ప్రవేశపెట్టడం సరికాదని వైసిపి ఆక్షేపించింది. జిల్లా పరిషత్తులో సభ్యులందరినీ అవమానించడమేనని రొంపిచర్ల జెడ్‌పిటిసి పి.ఓబులరెడ్డి విమర్శించారు. భవిష్యత్తులో ఇలా జరగకుండా చూడాలన్నారు. ఎంపి శ్రీకృష్ణదేవరాయులు, సీనియర్ ఎమ్మెల్యేల సూచనలతో సభ్యులు ఇందుకు సంబంధించిన బిల్లులను ఆమోదించారు.



విలేకర్లతో మాట్లాడుతున్న వామపక్ష పార్టీల నాయకులు

నిరసనలపై ఆంక్షలను ఎత్తేయాలి

వామపక్ష పార్టీల డిమాండ్

ప్రజాశక్తి-గుంటూరు

ప్రజా సమస్యలపై జిల్లాలో రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు నిర్వహించే నిరసనలపై పోలీసుల ఆంక్షలు ఎత్తివేయాలని వామపక్ష పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం బ్రాడీపేటలోని పిఎల్‌రావు భవన్‌లో సిపిఎం, సిపిఐ, సిపిఐ (ఎంఎల్), సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ, సిపిఐ (ఎంఎల్) ప్రజాపోరు, సిపిఐ(ఎంఎల్) రెడ్‌స్టార్, సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీల నాయకుల సమావేశం జరిగింది. అనంతరం ఆయా పార్టీల నాయకులు మీడియాతో మాట్లాడారు. సభలు, సమావేశాలు, ర్యాలీలు, నిరసనలకు వారం రోజుల ముందుగా పోలీసుల అనుమతి తీసుకోవాలని, సెక్షన్ 30 పోలీసు చట్టం ప్రకారం ఆంక్షలు విధించటం సరికాదని అన్నారు. రైతులు, కార్మికులు, వివిధ వర్గాల పేదలు వారి సమస్యల కోసం పోరాడే క్రమంలో ఆంక్షల పేరుతో ఉద్యమాలను అణచివేయటానికే ఈ ఆంక్షలని విమర్శించారు. నిరసన తెలిపే హక్కును రాజ్యాంగం పౌరులకు కల్పించిందని, పోలీసులు పౌర హక్కులను కాలరాస్తున్నారని అన్నారు. అన్ని సందర్భాల్లో ముందస్తు అనుమతి తీసుకోవటం సాధ్యం కాదని, దరఖాస్తు చేసినా అనుమతి ఇస్తారనే గ్యారంటీ లేదని చెప్పారు. నిరంకుశ బ్రిటీషు కాలంలో 1861లో తెచ్చిన సెక్షన్ 30ని ఇప్పుడు జిల్లాలో అమలుకు పూనుకుంటున్నారని విమర్శించారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ అమలు చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం ఇప్పుడు నిర్బంధం ప్రయోగిస్తోందని, ఈ ఆంక్షలు పోలీసుల విధానమైతే ప్రభుత్వం జోక్యం చేసుకొని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు

2లో

ఆగస్టు 25న కలెక్టరేట్ల వద్ద ఆందోళనలు

రజకవృత్తిదార్ల సామాజిక రక్షణ చట్టంపై ప్రభుత్వం తాత్సారం - 2 లో

మనవరాలిని చంపిన తాత 2 లో



దామరపల్లి గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్

రాజధానికి మా భూములివ్వం

గ్రామ సభలో స్పష్టం చేసిన దామరపల్లి గ్రామ రైతులు

ప్రజాశక్తి - తాడికొండ : రెండో విడత భూసమీకరణలో తాము భూములు ఇచ్చేది లేదని దామరపల్లి గ్రామ రైతులు తేల్చి చెప్పారు. రాజధానికి భూ సమీకరణలో భాగంగా శుక్రవారం మండలంలోని దామరపల్లి, ఫణిదరం, బండారుపల్లి గ్రామాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు తమ అభిప్రాయాలను సభలో చెప్పారు. ఒక్క రైతు మినహా మిగిలిన రైతులు అందరూ తమ భూములు ఇవ్వబోమని తేల్చిచెప్పారు. తాము గుంటూరుకు అతి సమీపంలో ఉన్నామని, ఇక్కడ భూముల ధర రూ.కోట్లు పలుకుతుందని, అలాంటిది భూములిచ్చి ఇబ్బంది పడే బదులు ఇవ్వకుండా ఉండటమే మంచిదని అన్నారు. దామరపల్లి గ్రామానికి చెందిన గొంది హరిబాబు ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే తెనాలి శ్రావణ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఇదిలా ఉండగా గ్రామంలో అంతా సన్న, చిన్న కారు రైతులు, కూలి పనులు చేసుకొని జీవనం సాగించే వారమని, గ్రామ చుట్టుపక్కల వెంచర్లు వచ్చాయని, పట్టణ సంస్కృతి కనిపిస్తోందని, తమ గ్రామాన్ని గుంటూరులో విలీనం చేయాలని ఫణిదరం గ్రామస్తులు కోరారు.



తుళ్లూరు సిఆర్‌డిఎ కార్యాలయంలో సిటిజన్స్ అడ్వయిజరీ కమిటీ సభ్యులతో సమావేశంలో అధికారులు

తొలివిడత భూములను అభివృద్ధి చేయకుండా

మరో లక్ష ఎకరాలా..!?

సిఆర్‌డిఎ సమావేశంలో రైతుల అభ్యంతరం

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని నిర్మాణానికి తొలివిడత ఇచ్చిన భూములను అభివృద్ధి చేయకుండా మరో లక్ష ఎకరాల తీసుకోవడం సబబు కాదని సిఆర్‌డిఎ సమావేశంలో రాజధాని రైతులు అభ్యంతరం వ్యక్తం చేశారు. రాజధాని అమరావతి పరిధిలోని తుళ్లూరు సిఆర్‌డిఎ ప్రాంతీయ కార్యాలయంలో సిటిజన్స్ అడ్వయిజరీ కమిటీ చైర్మన్ డి.నారాయణరావు అధ్యక్షతన సిటిజన్స్ కమిటీ 2వ సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా సిటిజన్స్ అడ్వయిజరీ కమిటీ సభ్యులు బెల్లంకొండ నరసింహారావు, మరికొందరు రైతులు మాట్లాడుతూ రాజధాని నిర్మాణానికి

2లో



సమ్మె పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

9న సమ్మెలోకి మెడికల్ రిప్రజెంటేటివ్‌లు

ప్రజాశక్తి-గుంటూరు

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, కనీస వేతనాలు అమలు తదితర డిమాండ్లతో జులై 9న దేశ వ్యాప్తంగా కార్మిక సంఘాలు తలపెట్టిన సార్వత్రిక సమ్మెలోకి మెడికల్ రిప్రజెంటేటివ్‌లు పాల్గొంటున్నట్లు ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు షేక్.అబ్దుల్ సలీమ్ తెలిపారు. శుక్రవారం బ్రాడీపేటలోని సిఐటియు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో డిమాండ్ల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సలీం మాట్లాడుతూ జిల్లాలో ఉన్న 1200 మంది మెడికల్ రిప్రజెంటేటివ్‌లు సమ్మెలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం దుర్మార్గంగా తెచ్చిన లేబర్ కోడ్‌లను రద్దుచేసి పాత కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని, లేబర్ కోడ్‌ల వల్ల నిర్వీర్యం అవుతున్న సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయ్ చట్టాన్ని పునరుద్ధరించి ఫార్మా యాజమాన్యాలు సేల్స్‌ప్రమోషన్ ఎంప్లాయ్ యాక్ట్‌ను కచ్చితంగా అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని, మెడికల్ రిప్రజెంటేటివ్‌లకు కచ్చితమైన పని పద్ధతులు కల్పించాలని, సేల్స్

2లో

జిడిసిసిబి మాజీ చైర్మన్ నల్లపాటి శివరామ చంద్రశేఖరరావు మృతి



ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : నరసరావుపేట మండలం జొన్నలగడ్డ గ్రామానికి చెందిన ఆంధ్రరాష్ట్ర తొలి సభాపతిగా పని చేసిన నల్లపాటి వెంకట్రామయ్య చౌదరి సోదరుడు, జిడిసిసి బ్యాంక్ మాజీ చైర్మన్ నల్లపాటి శివరామ చంద్రశేఖరరావు (83) అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో శుక్రవారం ఉదయం మృతి చెందారు. శివరామ చంద్రశేఖరరావు (చంద్రం) నరసరావుపేట రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేకత చాటుకున్నారు. టిడిపి హయాంలో నరసరావుపేట జెడ్‌పిటిసిగా, కాంగ్రెస్ హయాంలో ఉమ్మడి గుంటూరు జిల్లా జిడిసిసి బ్యాంకు చైర్మన్‌గా ఎన్నికయ్యారు. విద్యా, వ్యాపార రంగాల్లోనూ ప్రవేశించారు. నాలుగేళ్ల క్రితం చంద్రశేఖరరావు భార్య ప్రమీల హఠాన్మరణం చెందారు. హైదరాబాదు నుంచి స్వగ్రామానికి తెచ్చిన ఆయన భౌతికకాయాన్ని రావిపాడు కమ్మ వసతి గృహం వద్ద నుండి ర్యాలీగా జొన్నలగడ్డ గ్రామ పరిధిలోని జీవన జ్యోతి శీతలగిడ్డంగి వద్దకు తీసుకొచ్చారు. అక్కడ పలువురు నివాళులర్పించారు. అంత్యక్రియలను శనివారం నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన మృతికి ప్రభుత్వ చీఫ్‌విప్ జీవి ఆంజనేయులు, సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, మాజీ మంత్రి కాసు వెంకట కృష్ణారెడ్డి, జనసేన నాయకులు సయ్యద్ జిలాని సంతాపం తెలిపారు. చంద్రశేఖరరావుకు కుమారులు రామచంద్ర ప్రసాద్, వంశీ మోహన్ ఉన్నారు.

పల్నాడులో 63912 బంగారు కుటుంబాల నమోదు లక్ష్యం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : స్వర్ణాంధ్ర పి4, విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్స్ అంశంపై రాష్ట్ర సచివాలయం నుండి శుక్రవారం సిఎం చంద్రబాబు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో నరసరావుపేటలోని కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, మాట్లాడారు. పల్నాడు జిల్లాలో మొత్తం 63,912 బంగారు కుటుంబాల నమోదు లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్దేశించిందన్నారు. ఇందులో భాగంగా చిలకలూరిపేట నియోజకవర్గానికి 9,818 కుటుంబాలు, గురజాల నియోజకవర్గానికి 8,439 కుటుంబాలు, మాచర్లకు 10,394 కుటుంబాలు, నరసరావుపేటకు 8,111 కుటుంబాలు, పెదకూరపాడులో 9,214 కుటుంబాలు, సత్తెనపల్లిలో 8,085 కుటుంబాలు, వినుకొండలో 9,850 కుటుంబాలు లక్ష్యంగా నిర్దేశించినట్లు చెప్పారు.

ఆగస్టు 25న కలెక్టరేట్ల వద్ద ఆందోళనలు

ప్రజాశక్తి - తాడేపల్లి

రాష్ట్రవ్యాప్తంగా రజక వృత్తిదార్లపై దాడులు, దౌర్జన్యాలు, అక్రమ కేసులను నిరసిస్తూ వచ్చేనెల 25న రాష్ట్రవ్యాప్తంగా అన్ని కలెక్టరేట్‌ల ఎదుట ఆందోళనలు నిర్వహించనున్నట్లు ఏపీ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నూరు భాస్కరయ్య తెలిపారు. సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం రాష్ట్ర అధ్యక్షులు శ్రీగురు శేఖర్ అధ్యక్షతన గురు, శుక్రవారాల్లో తాడేపల్లిలోని రాష్ట్ర కార్యాలయంలో జరిగింది. చర్చించిన అంశాలు, తీర్మానాలను మీడియాకు భాస్కరయ్య విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం



సమావేశంలో మాట్లాడుతున్న ఎం.భాస్కరయ్య

ఎన్నికల ప్రణాళికలో ప్రకటించిన విధంగా రజకులకు సామాజిక రక్షణ చట్టం కోసం సబ్ కమిటి ఏర్పాటు విషయంలో కాలయాపన చేస్తోందని, దీంతో ఇప్పటికీ

రజకవృత్తిదార్ల సామాజిక రక్షణ చట్టంపై ప్రభుత్వం తాత్సారం

దాడులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 50 ఏళ్లు నిండిన ప్రతి వృత్తిదారునకి వృద్ధాప్య పింఛను, ప్రభుత్వం ఏర్పాటు చేసిన రజక అభివృద్ధి - సంక్షేమ కార్పొరేషన్లకు విధివిధానాలు రూపొందించి, రాష్ట్ర బడ్జెట్లో నిధుల కేటాయింపు, లాండ్రీ వృత్తిదారులకు నెలకు రూ.250 యూనిట్లు ఉచిత విద్యుత్ తదితర వాగ్దానాలను ఎన్నికలప్పుడు ఇచ్చినా అమలు చేయలేదని చెప్పారు. సమావేశంలో నాయకులు వి.వెంకటేశ్వరరావు, బి.సుబ్బారావు, కె.రాజు, సిహెచ్.వెంకట రెడ్డయ్య, ఎం.రాజు, ఎల్.నిర్మలమ్మ, ఆర్.అంకయ్య పాల్గొన్నారు.

మనవరాలిని చంపిన తాత

ప్రజాశక్తి- తాడేపల్లి

మానసిక వికలాంగురాలైన 25 ఏళ్ల మనవరాలిని తాతయ్యే హతమార్చిన కేసు మిస్టరీని తాడేపల్లి పోలీసులు చేధించారు. ఈ మేరకు వివరాలను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో డిఎస్పీ సిహెచ్ మురళీకృష్ణ వెల్లడించారు.. ఈనెల 1వ తేదీ కుంచనపల్లి బ్రిడ్జిపై నుండి గుర్తుతెలియని యువతి బకింగ్ హామ్ కాల్వలో పడి మృతి చెందింది. తాడేపల్లి సిఐ వీరేంద్రబాబు, ఎస్సైలు ప్రతాప్ కుమార్, ఎస్కే ఖాజావలి కేసు దర్యాప్తు చేపట్టగా తాటికొండ మండలం బడేపురం గ్రామానికి చెందిన కూరపాటి మాధవరావు ఈ ఘాతకానికి పాల్పడినట్లు తెలిసింది. మృతురాలు పుట్టుకతోనే మూగ, చెవిటి, మానసిక వికలాంగురాలు. తల్లిదండ్రులు చిన్నతనంలోనే చనిపోయారు. ఈ క్రమంలో ఆమెను



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు, వెనక ముసుగులో నిందితుడు మాధవరావు

ఈనెల ఒకటిన మందుల కోసమని గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్)కు తీసుకువచ్చిన మాధవరావు అనంతరం కుంచనపల్లి బ్రిడ్జి వద్దకు తెచ్చి, బ్రిడ్జిపై నుండి కాల్వలోకి తోసేశాడు. కేసును గంటల వ్యవధిలో చేధించిన పోలీసులు నిందితుణ్ణి అదుపులోకి తీసుకున్నారు.

కెసిపిలో మాక్‌డ్రిల్

ప్రజాశక్తి - మాచర్ల : పట్టణంలో ఉన్న కెసిపి సిమెంట్ ఫ్యాక్టరీలో శుక్రవారం మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ అఫ్ ఫ్యాక్టరీస్ ఆర్.త్రినాధరావు మాట్లాడుతూ ప్రమాదాల సమయంలో పరిశ్రమలో సిబ్బంది, కార్మికుల మధ్య సమన్వయం ఎలా ఉందో తెలుసుకోవడానికి ఈ మాక్‌డ్రిల్ దోహదపడుతుందన్నారు. ఇన్స్పెక్టర్ అఫ్ ఫ్యాక్టరీస్ తెనాలి రాజు మాట్లాడుతూ ఫ్యాక్టరీస్‌లో ప్రమాదాలు జరగకుండా ఎప్పటికప్పుడు అన్నీ చూసుకోవాలని చెప్పారు. కెసిపి సంస్థ యూనిట్ హెడ్ వి.వెంకట రమణ



మాట్లాడుతూ ఎమర్జెన్సీ పరిస్థితిలో ఎలా స్పందించాలో అందరు తెలుసుకుంటే ప్రమాదాలను అరికట్టవచ్చని చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఆర్ విభాగాధిపతి కె.ఉదయ్ కుమార్, అన్ని విభాగాల అధిపతులు, ఉద్యోగులు, యూనియన్ ప్రతినిధులు, కార్మికులు పాల్గొన్నారు.

నిరసనలపై ఆంక్షలను ఎత్తేయాలి

(మొదటి పేజీ తరువాయి)

అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు నిస్వార్థంగా ఎప్పటికప్పుడు తమ నిరసన తెలిపి, ప్రజలకు అండగా ఉంటున్నాయని, వాటిని ఆంక్షలతో అణచివేయలేరని అన్నారు. తక్షణమే పోలీసుల ఆంక్షలను ఉపసంహరించుకోవాలని, ప్రజాస్వామ్య హక్కులను కాపాడాలని లేదంటే ఆంక్షలపై ఆందోళనలు చేస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ, సిపిఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా అధికార ప్రతినిధి వి.నరసింహారావు, సిపిఐ(ఎంఎల్) రెడ్‌స్టార్ రాష్ట్ర నాయకులు మన్నవ హరిప్రసాద్, సిపిఐ (ఎంఎల్) ప్రజాపోరు నాయకులు రవికుమార్, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పాశం రామారావు పాల్గొన్నారు.

మరో లక్ష ఎకరాలా..!?

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం ముందుగా తీసుకున్న భూములను అభివృద్ధి చేయకుండా మరో 80 వేలు, లక్ష ఎకరాలు తీసుకుంటున్నట్లు వింటున్నామని, అదే జరిగితే ముందుగా ఇచ్చిన భూముల్లో నిర్మాణాలు, అభివృద్ధి పనులు ఎలా సాగుతాయని ప్రశ్నించారు. రెండవ, మూడవ విడత భూముల పైనే దృష్టి ఉంటుందే తప్ప ముందు తీసుకున్న భూములపై ఉండదని అన్నారు. 29 గ్రామాల్లో అభివృద్ధి జరిగాక రాజధానిని విస్తరిస్తే సబబుగా ఉంటుందన్నారు. వైసిపి ప్రభుత్వంలో ఒక విధంగా నష్టపోతే ప్రస్తుత ప్రభుత్వంలో కూడా ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామకంఠాల సమస్య, కౌలు చెల్లింపు, రాజధానికి చట్టబద్ధత కల్పించడం, రాజధాని గ్రామాల్లో నిర్మించిన వెల్‌నెస్, హెల్త్ సెంటర్లు, అంగన్‌వాడీ కేంద్రాలను ప్రారంభించడం తదితర సమస్యలను ఏకరువు పెట్టారు. రాజధానిలో కేంద్ర ప్రభుత్వ సంస్థలు, కార్యాలయాల కార్యకలాపాలు మొదలుకావాలని, బోరుపాలెం నిమ్మ రైతులకు జరీబు ప్యాకేజీ అమలు, రైతుల ప్లాట్లలో సర్వే రాళ్ల ఏర్పాటు, రాజధాని గ్రామాల అభివృద్ధికి డిపిఆర్ రూపకల్పన ప్రతిపాదన తదితర అంశాలపై రైతులు మాట్లాడారు. సిఆర్‌డిఎ అదనపు కమిషనర్ జి.సూర్యసాయి ప్రవీణ్‌చంద్ మాట్లాడుతూ సిటిజన్స్ కమిటీ సభ్యుల సూచనలు, సలహాలు పరిగణలోకి తీసుకుంటామని చెప్పారు. రాజధాని అమరావతి నిర్మాణ పనుల్లో పురోగతి, రాజధాని ప్రాంతంలో అమలవుతున్న సామాజిక, సంక్షేమ కార్యకలాపాలను వివరించారు.

9న సమ్మెలోకి మెడికల్ రిప్రజెంటేటివ్‌లు

(మొదటి పేజీ తరువాయి)

పేరుతో ఫార్మా యాజమాన్యాలు మెడికల్ రిప్రజెంటేటివ్‌లపై వేధింపులు నివారించాలని తదితర డిమాండ్లతో సమ్మెలో పాల్గొంటున్నట్లు వివరించారు. యూనియన్ జిల్లా కార్యదర్శి ఎస్.మల్లికార్జునరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మందుల ధరలు తగ్గించాలని, మందులు, మందుల పరికరాలపై జిఎస్‌టి ఎత్తివేయాలని, ప్రభుత్వ రంగ మందుల కంపెనీలను స్థాపించి వాటిని బలోపేతం చేయాలని, మెడికల్ రిప్రజెంటేటివ్‌లకు కనీస వేతనం రూ.26900లు వేతనం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు చిల్లా ఫణీంద్ర, జి.శ్రీనివాసరావు జిల్లా ఉపాధ్యక్షులు వెంకటరత్నం, జిల్లా జాయింట్ సెక్రెటరీలు కృష్ణప్రసాద్, అనిల్‌కుమార్, సంఘం సభ్యులు హనుమంతరావు, అక్తర్‌బాష, జానీ పాల్గొన్నారు.

మంత్రులు, మెజార్టీ ఎమ్మెల్యేల డుమ్మా

(మొదటి పేజీ తరువాయి)

కోరారు. బనకచర్ల ప్రాజెక్టు పేరుతో బొల్లాపల్లి మండలంలో కొన్ని గ్రామాలను ఖాళీ చేయించాలని ప్రయత్నిస్తున్నారని, వారి పరిస్థితి ఏమిటని బొల్లాపల్లి జెడ్‌పిటిసి మాడవత్ లక్ష్మీబాయి ప్రశ్నించగా వారికి మెరుగైన పునరావాసం కల్పిస్తామని జి.వి.ఆంజనేయులు సమాధానమిచ్చారు. మిర్చి ధరలు తగ్గిపోవడంపై పలువురు సభ్యులు ప్రశ్నించగా అంతర్జాతీయ కారణాలను చెప్పారు. అయితే మిర్చి రైతుల విషయంలో వ్యాపారులు మోసం చేశారని పలువురు సభ్యులు విమర్శించారు. ఆర్డర్లు లేవని చెబుతూనే ఎలా కొనుగోలు చేశారని ప్రశ్నించారు.

శాస్త్రవేత్తలు అధికారులు ఏం చేస్తున్నారు : మర్రి రాజశేఖర్

పత్తి, మిర్చి రైతులకు పెట్టుబడి భారీగా పెరిగిందని దీనిని నిరోధించేందుకు రైతులకు వ్యవసాయ శాఖ సాయం చేయడం లేదని ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ అన్నారు. కొన్నేళ్లుగా మిర్చిపై నల్లతామర, పత్తిపై గులాబి పురుగులు వస్తుంటే వాటి నివారణకు శాస్త్రవేత్తలు ఏం చేశారని ప్రశ్నించారు. పురుగు మందులు అధికంగా వాడటం వల్ల మిర్చి ఇతర దేశాల్లో కొనుగోలు చేయడం లేదని, ఇటీవల చైనా నుంచి కంటైనర్లు తిరిగి వచ్చిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. రూ.లక్షలు జీతాలు తీసుకునే వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు, శాస్త్రవేత్తలు తెగుళ్ల నివారణకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని ధ్వజమెత్తారు. వ్యాపారులకు ఉన్న అర్డర్ల మేరకు రైతుల నుంచి పొగాకు కొనుగోలు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఎత్తిపోతల పథకాలపై చర్చలో మర్రి రాజశేఖర్, మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి తదితరులు మాట్లాడుతూ 90 శాతం పథకాలు మూలన పడ్డాయన్నారు. ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా నిధులు మంజూరు చేస్తే నిర్వహణలో ఇబ్బందులు ఉండవన్నారు. రైతులతో కమిటీలు పునరుద్ధరించి వాటి నిర్వహణపై దృష్టి పెట్టాలన్నారు. ఎవరు అధికారంలో ఉంటే వారు అదనపు వసూళ్లు చేస్తున్నారని, రాజకీయ ప్రమేయంతో మైనర్ ఇరిగేషన్ పథకాలన్నీ దెబ్బతిన్నాయని విమర్శించారు. జి.వి.ఆంజనేయులు మాట్లాడుతూ ఎత్తిపోతల పథకాలు నిర్వహణపై ఇరిగేషన్ స్టాండింగ్ కమిటీ సమావేశంలో చర్చించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందించాలని ఎంపి కోరారు. ఎత్తిపోతల పథకాలకు కేంద్రం కేటాయించిన రూ.300 కోట్లను ఉపయోగించుకోవాలన్నారు. అమరావతిలో అనధికారిక లే అవుట్లు ఎక్కువగా ఉన్నాయని ఎంపిపి మేకల హనుమంతరావు ఫిర్యాదు చేయగా పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు సమాధానమిస్తూ గ్రామీణ ప్రాంతాల్లోని అనాధికార లే అవుట్లపై చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయితీ అధికారికి అదేశాలిచ్చామని చెప్పారు.

కల్తీ విత్తనాల బెడద లేకుండా చూడాలని ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం కోరారు. ఇప్పటికే విత్తనాలు మార్కెట్‌లోకి వచ్చాయని జెడ్‌పిటిసి ఓబులరెడ్డి అన్నారు. ప్రతి గ్రామం తనిఖీ చేస్తామని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. అమరావతి ఎంపిపి హనుమంతరావు మాట్లాడుతూ కల్తీ విత్తనాల వల్లే ఎక్కువగా తెగుళ్లు వస్తున్నాయన్నారు. మిర్చికి తగిన మద్దతు ధర లేదని, కనీస మద్దతు ధర రూ.20 వేలు ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

కౌలు రైతులను గుర్తించాలి : ఆలపాటి

జిల్లాలో అసలు రైతుల కంటే కౌలు రైతులు 80 శాతం మంది ఉన్నారని, వీరిని గుర్తించి వారికి తగిన సదుపాయాలు కల్పించాలని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ కోరారు. కౌల్దార్లకు బ్యాంకు రుణాలివ్వాలన్నారు. గతేడాది 37 వేలు మందికి సిసిఆర్‌సి కార్డులు ఇచ్చామని ఈ ఏడాది 46 వేలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నామని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మీ తెలిపారు. ఇంకా ఎక్కువ మంది ఉన్నా నిబంధనల ప్రకారం కార్డులు ఇస్తామన్నారు. ఇందుకు సంబంధించి చట్టసవరణ ఇంకా జరగలేదన్నారు. భూసార పరీక్షలు సరిగా జరగడంలేదని డిసిసిబి చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు ప్రస్తావించగా నిర్వహణకు పిపిపి విధానంలో మినీ భూసార పరీక్ష కేంద్రాలు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఎంపి సూచించారు.

ఆరోగ్య కార్డులపై అయోమయం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న ఆరోగ్య పథకాలకు సంబంధించి జారీ చేస్తున్న కార్డులు ప్రజలకు ఇంకా అందలేదని, ఎప్పటికి అందిస్తారని పలువురు సభ్యులు ప్రశ్నించారు. ఈ పథకాలపై ప్రజలకేకాక తమకే అవగాహన లేదని పలువురు సభ్యులు ధ్వజమెత్తారు. పల్నాడు ప్రాంతంలో వైద్య సేవలపై పలువురు సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. జెడ్‌పిటిసి ఓబులరెడ్డి మాట్లాడుతూ నరసరావుపేట ప్రభుత్వ ఆస్పత్రిలో సిటీ, ఎంఆర్ఐ స్కాన్ లేవన్నారు. మాచర్ల ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ గుండె, బ్రెయిన్ స్ట్రోక్ వచ్చిన వారికి అత్యవసర పరిస్థితులలో అందించే ఇంజక్షన్లు, వెంటిలేటర్లు, ప్రాథమిక, కమ్యూనిటీ ఆరోగ్యకేంద్రాల్లో అందుబాటులో ఉంచాలన్నారు. 150 కిలో మీటర్ల దూరంలో ఉన్న గుంటూరు వెళ్లే లోపు ఎక్కువ మంది చనిపోతున్నారన్నారు. ఇదిలా ఉండగా ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను 4వ స్థాయి సంఘం సభ్యునిగా ఎంపిక చేస్తూ సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు. ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రజా పరిషత్ స్థాయి సంఘాల్లో అమోదించిన పనులకు ఏకగ్రీవంగా అమోదం తెలిపారు. సమావేశంలో డిసిఎంఎస్ చైర్మన్ వి.హరిబాబు, బాపట్ల డిఆర్ఓ గంగాధర్‌గౌడ్, జిల్లా పరిషత్ సీఈఓ జ్యోతిబసు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య పోరాటంలో అల్లూరికి ప్రత్యేక స్థానం

ప్రజాశక్తి-గుంటూరు



దేశ స్వాతంత్ర్యం, ఆదివాసీల హక్కుల కోసం పోరాడిన గొప్ప విప్లవ యోధుడు అల్లూరి సీతారామ రాజు అని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ అన్నారు. శుక్రవారం స్థానిక నాజ్‌సెంటర్ వద్ద అల్లూరి సీతారామరాజు 128 వ జయంతిని పురస్కరించుకొని కలెక్టర్ నాగలక్ష్మీ, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ అహ్మద్, నగర కమిషనర్ పులి శ్రీనవాసులు, అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో అల్లూరి పాత్ర ప్రత్యేకమైందని, బ్రిటీషు ప్రభుత్వం అల్లూరిని బంధించటానికి నగదు బహుమతి వంటి కుటిల ప్రయత్నాలు చేసిందన్నారు. కార్యక్రమంలో డిఆర్‌ఓ ఎన్.ఎస్.కే.ఖాజావలి, స్టెఫ్ సిఇఓ చంద్రముని , జిల్లా గిరిజన సంక్షేమ శాఖాధికారి పి. మురళి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అల్లూరి సీతారామరాజు మరణం లేని ఓ విప్లవ వీరుడని, తెలుగుజాతికి, అడవి బిడ్డలకు ఆరాధ్యదైవం అని వక్తలు పేర్కొన్నారు. స్థానిక నాజ్ సెంటర్‌లోని అల్లూరి విగ్రహానికి, అవగాహన సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమానికి కొండా శివరామిరెడ్డి అధ్యక్షత వహించారు.ఈ కార్యక్రమంలో కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రలో తెల్లదొరలకు సింహస్వప్నంగా నిలిచిన పోరాట యోధుల్లో అల్లూరి సీతారామరాజు ఒకరన్నారు. స్వాతంత్ర్యం పొందటానికి సాయుధ పోరాటం ఒక్కటే మార్గమని అల్లూరి నమ్మారని, ఆయన పోరాట పటిమతో బ్రిటీషు సైన్యాన్ని వణికించారన్నారు. కార్యక్రమంలో యోగాచార్యులు అచ్యుత ఇందుశేఖర్, విద్యావేత్త ఇ.చంద్రయ్య, విశ్లేషకులు ఆర్.వి.సింగరయ్య, ఎన్.సదాశివం, రాఘవరావు, సుబ్బారావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. ఫిరంగిపురం, మంగళగిరి , చేబ్రోలులో అల్లూరి విగ్రహాలకు,చిత్రపటాలకు ఘన నివాళులర్పించారు. గుంటూరు పుడిగుంటలోని మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజినీరింగ్ కలేజీలో అల్లూరి జయంతి నిర్వహించారు.

వర్సిటీలో పలువురికి ప్రమోషన్లు

ప్రజాశక్తి – ఎఎన్‌యు : వర్సిటీలో జూనియర్ అసిస్టెంట్లు విధులు నిర్వహిస్తున్న బి.ప్రవీణ్ కుమార్, ఎ. కష్ణప్రసాద్లకు ఉద్యోగోన్నతి లభించింది. ఈమేరకు శుక్రవారం తాత్కాలిక వీసి ఆచార్య కె.గంగ ధరరావు, తాత్కాలిక రెక్టార్ ఆచార్య కె.రత్నషీలామణి, తాత్కాలిక రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలంలు జూనియర్ అసిస్టెంట్లుగా ఉన్న వారిని సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పిస్తూ నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంలో జాయింట్ రిజిస్ట్రార్ సత్యవతి, వికాస అధ్యక్షుడు ఎన్.ప్రసాద్, ఉపాధ్యక్షుడు డి. విజయప్రకాష్, కార్యదర్శి జ . శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరి ఎన్.నాగేశ్వర రావు, కార్యవర్గ సభ్యులు పి.నాగరాజు, శశిధర్, ఎన్.వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు పద్నోతులు పొందిన వారికి శుభాకాంక్షలు తెలిపారు.

గుప్తా కళాశాలలో రోశయ్య జయంతి

ప్రజాశక్తి – తెనాలి

స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఎన్ ఆర్ కె అండ్ కెఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య 92వ జయంతి వేడుకలు నిర్వహించారు. ప్రిన్సిపల్ గోగినేని విజయకష్ణ ఆధ్వర్యంలో తొలుత రోశయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాల ఏర్పాటుకు అప్పటి రెవిన్యూ శాఖ మంత్రిగా ఉన్న రోశయ్య ఎంతో విలువైన సలహాలు, సూచనలు ఇచ్చారని కొనియాడారు. ముఖ్యమంత్రిగా రాష్ట్ర ప్రగతికి ఎంతో కషి చేశారని చెప్పారు. కార్యక్రమంలో మేనేజర్ డి శ్రీనివాసరావు, అధ్యాపకులు ఎం దశరధరామిరెడ్డి, కె.వి రవికుమార్ ఆర్ వి సునీత, డి రోశయ్య, ఏ నాగరాజు, వి వేణుగోపాల్, విద్యార్థులు పాల్గొన్నారు

వంగవీటి మోహనరంగా విగ్రహాలకు పూలమాలలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన గొప్ప నాయకుడు వంగవీటి మోహనరంగా ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డేగల ప్రభాకర్ అన్నారు.రంగా జయంతిని పురస్కరించుకొని పాత గుంటూరు ఆంజనేయస్వామి గుడి వద్ద రంగా విగ్రహానికి చైర్మన్ డేగల ప్రభాకర్ పూలమాలలు వేసి ఘనమైన నివాళులు అర్పించారు. ప్రభాకర్ మాట్లాడుతూ రంగా ప్రజల మనిషి, పేదల నాయకుడు అని కొనియాడారు.ఆయన చివరి శ్వాస వరకు పేదలకి అండగా నిలబడ్డారని పేర్కొన్నారు. యర్రంశెట్టి వేణు,యర్రగోపు నాగేశ్వరావు,యడ్ల నాగమల్లేశ్వరావు,ఇర్రి సాయి,తోట అక్కి,కోగలని సుబ్బారావు,అల్లం బాజీ,రాగం సదాశివరావు,పొన్నెగంటి శ్రీను,,మానస ప్రభు,చెన్నంశెట్టి చక్రపాణి,జెడ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి తాడేపల్లి రూరల్ : ఎంటిఎంసీ పరిధిలోని కుంచనపల్లిలో శుక్రవారం ఉదయం గాంధీ బొమ్మ సెంటర్, ప్రాతూరు రోడ్, కుంచనపల్లి హైవే దగ్గర కాంగ్రెస్ పార్టీ విజయవాడ మాజీ శాసనసభ్యులు స్వర్గీయ వంగవీటి మోహన్ రంగా జయంతి వేడుకలు జనసేన, టిడిపి శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ముందుగా రంగా విగ్రహానికి టీడీపీ,జనసేన కుంచనపల్లి గ్రామ పార్టీ అధ్యక్షులు మేకల రాజా, కానుగోలు కోటేశ్వరరావు,పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.అనంతరం కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో శేషంశెట్టి శ్రీనివాసరావు,కొవ్వూరి సురేష్,బొడ్డు మహేంద్ర, కొమ్మిరిశెట్టి సాంబశివరావు,తోటకూర ప్రవీణ్, అమ్మిశెట్టి సురేష్, శేషంశెట్టి చంద్రశేఖర్, మేకల సుబ్బు,అమ్మిశెట్టి రాజేష్, అమ్మిశెట్టి శ్రీనివాసరావు, కాజా వెంకటేశ్వరరావు, ముంగిట వీర్లంకయ్య, యెనుముల పార్ధు, మేకల ప్రపూర్ణ కానుగోలు నారాయణ, కానుగోలుచిన్న నారాయణ,మరియు టిడిపి,జనసేన,బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి తాడేపల్లి రూరల్ : కాంగ్రెస్ పార్టీ, విజయవాడ మాజీ శాసనసభ్యులు స్వర్గీయ వంగవీటి మోహన రంగా 78వ జయంతి కార్యక్రమం ఎంటిఎంసి పరిధిలోని ప్రాతూరు గ్రామంలో శుక్రవారం ఉదయం సూరిశెట్టి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఈ జయంతి కార్యక్రమానికి వంగవీటి మోహనరంగా కుమారుడు వంగవీటి రాధా బాబు ముఖ్య అతిథిగా విచ్చేసి, రంగా విగ్రహానికి పూలమాలవేసి కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మంగళగిరి నియోజకవర్గం బీసీ సెల్ కార్యదర్శి దావులూరి శ్రీనివాసరావు, మంగళగిరి నియోజకవర్గ తెలుగు యువత నాయకులు సంకరు నాని, రాచర్ల రాము, జనసేన నాయకులు పెద్దినేని వేణు, జనసేన పార్టీ గ్రామ అధ్యక్షులు సంకూరు విజయసాగర్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు వరి విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి – తెనాలిరూరల్

తెనాలి అర్బన్ రైతు సేవా కేంద్రంలో శుక్రవారం వరి విత్తనాలు పంపిణి చేశారు. మండల వ్యవసాయ అధికారి కె. సుధీర్ బాబు విత్తనాలు రాయితీపై రైతు సేవా కేంద్రాల వద్ద అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వరి విత్తనాలు సబ్సిడీపై పొందొచ్చని చెప్పారు. 25 కిలోల వరి విత్తనాల ధర రూ.1075 కాగా సబ్సిడీపై రూ. 950 పొందొచ్చన్నారు. కార్యక్రమంలో ఈదర పూర్ణచంద్ గారు, ఈదర బాబు, వెలగపూడి హర్ష, ఈదర రమణ బుచ్చిబాబు, మేకల చిట్టిబాబు, కాకుమాను వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దస్తావేజులు పోయినవి

గుంటూరు జిల్లా, ఫిరంగిపురం మండలం, రేపూడి గ్రామం, డోర్ నెం. 1-27 రు, కాపురస్తురాలైన (లేటు) ఈవూరి వెంకటేశ్వరరెడ్డి గారి భార్య సుశీల గారు వయస్సు 39 సం.లు, ఆధార్ నెం. 9162 8465 5175 వ్రాసుకొన్న విన్నపము.

నా భర్త గారి పేర ఫిరంగిపురం సబ్ రిజిస్ట్రార్ వారి కార్యాలయంలో రిజిష్టరు కాబడిన దఖలు ద.నెం.1143/1996రుగా గల ఒరిజినల్ దఖలు దస్తావేజు నేను ది.03-07-2025వ తేదీన రేపూడి గ్రామం నుండి పొనుగుపాడు గ్రామ సచివాలయమునకు ఆటోలో ప్రయాణిస్తుండగా మార్గమధ్యలో ద.నెం. 1143/1996 రుగా గల ఒరిజినల్ దఖలు దస్తావేజు పోయినవి. నేను ఎంత వెతికిననూ దొరకలేదు. కావున నా యందు దయవుంచి ద.నెం.1143/1996 ఒరిజినల్ దఖలు దస్తావేజు ఎవరికైనా దొరికిన యెడల అప్పగించవలసినదిగా కోరడమైనది.

వివరాలకు:**8500032464** కు తెలుపగలరు.

ఒరిజినల్ దస్తావేజులు పోయినవి

గుంటూరు జిల్లా, తుళ్లూరు సబ్.డి, తుళ్లూరు మండలం,రాయపూడి గ్రామ డి.నెం 317 రు లో డోర్ నెం.1- 77 రు కు సరియగు పూరిల్లును తీసివేయగా అక్కడ ఏర్పడిన చ.గ 128 (రెండు అయి టములు) ఖాళీ నివేశన స్థలము నా తల్లి దార్ల నవనీతం గారి పేరున దఖలు దస్తావేజు వ్రాయబడి ది.16-09-2015 వ తేదీన శ్రీ మంగళగిరి సబ్ రిజిస్ట్రార్ వారి ఆఫీసులో దస్తావేజు నెంబర్ 13133/2015 రు గా దఖలు దస్తావేజు నా తల్లి గారి పేరున రిజిస్టర్ జరిగి ఉన్నది. నాతల్లి గారు మరణించి ఉన్నారు. వారు జీవించి ఉన్న కాలము నందు సదరు ఒరిజినల్ దస్తావేజు నాకు జాగ్రత్త చేయమని ఇచ్చి ఉన్నారు.అయితే ది.25-06-2025వ తేదీన సదరు పై తెలిపిన ఒరిజినల్ దస్తావేజును తీసుకొని రాయపూడి గ్రామము నందు గల మా యింటి వద్ద నుండి రాయపూడి గ్రామ పంచాయతీ ఆఫీసుకు టూ వీలర్ పై వెళ్ళుచుండగా మార్గమధ్యంలో సదరు ఒరిజినల్ దస్తావేజు ఎక్కడో పడి పోయినది. ద.నెం: 13133/2015 రు ఒరిజినల్ దస్తావేజు ఎవ్వరికైనా దొరికినచో ఈ క్రింది ఫోన్ నెంబర్ కు తెలియపరచ గలరు. **ఫోన్ నెంబర్ 8790145877**

ఇట్లు
దార్ల వెంకటేశ్వరరావు, S/o. ఏసోబు (లేటు)
రాయపూడి గ్రామం, తుళ్లూరు మండలం,
గుంటూరు జిల్లా.

బహిరంగ ప్రకటన
రిజిష్టర్డ్ సవరణ డాక్యూమెంట్స్ పోయినవి

ఇందు మూలముగా యావన్మందికి తెలియ జేయునది ఏమనగా మాకు మాచర్ల మండలం, రాయవరం గ్రామ శివారులో డి నెంబరు 401యందు 0.95 1/2 సెంట్ల భూమి తాలుకు సవరణ రిజిష్టర్ డాక్యూమెంట్ నంబరు 1284/2012 మరియు డి నెంబరు 406 యందు 219.6 చదరపు గజాల స్థలం తాలుకు సవరణ రిజిష్టర్డ్ డాక్యూమెంట్ నంబరు 1283/2012లు గల ఓరిజినల్ సవరణ రిజిస్ట్రేషన్ డాక్యూమెంట్స్‌ను మా ఇంటి నుండి తీసుకొని ది02.07.2025న ఉదయం 10 గంటల సమయంలో జిరాక్స్ నిమిత్తం పార్క్ సెంటర్‌కు వెళ్ళాను. జిరాక్స్ సెంటర్‌లో కవర్ చూడగా కవర్ చినిగి పైన ఉదహరించిన ఓరిజినల్ రిజిష్టర్డ్ డాక్యూమెంట్స్ కనిపించలేదు. వెంటనే నేను అన్నపూర్ణ అపార్ట్‌మెంట్ నుండి జిరాక్స్ సెంటర్ వరకు, తిరిగి నా ఇంటి వరకు వెనుతిరిగి మార్గమధ్యలో వెతికియున్నాను. అయినప్పటికి నాయొక్క రిజిష్టర్డ్ సవరణ డాక్యూమెంట్ నంబరు 1284/2012 మరియు రిజిష్టర్డ్ సవరణ డాక్యూమెంట్ నంబరు1283/2012 లు గల ఓరిజినల్ రిజిస్ట్రేషన్ డాక్యూమెంట్స్ దొరికి యుండలేదు. సదరు పైన ఉదహరించిన సవరణ డాక్యూమెంట్స్ ఎవరికి దొరికినను నాకు గాని, మాచర్ల టౌన్ పోలీసుస్టేషన్‌లో గాని స్వాధీన పర్చగలరని మనవి.

ఇట్లు
షేక్ మస్తాన్‌వలి
అన్నపూర్ణ అపార్ట్‌మెంట్, మాచర్ల టౌన్
సెల్‌నెంబరు 8519850039.

మహారాజశ్రీ తెనాలి సెకండ్ అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) తెనాలి వారి కోర్టులో
ఓ.ఎస్.నెం. 693/2024

బిట్వీన్
షేక్ కరిమున్నీసా ....వాది
ఎదిరి
షేక్ అబ్దుల్ అజీజ్ @ అబ్దుల్ అజీస్ @ అజీస్ .... ప్రతివాది

టు :
షేక్ అబ్దుల్ అజీజ్ @ అబ్దుల్ అజీస్ @ అజీస్
S/o. మోహ్మద్ షా, డోర్ నెం. 16-40, రషీద్
కిరాణా షాపు వద్ద, తేలప్రోలు గ్రామము,
తెనాలి మండలం, గుంటూరు జిల్లా.

పై నంబరు దావాలో వాది మీపై ప్రోనోటు బాకీ వసూలు నిమిత్తము దావా దాఖలు చేసి ప్రతివాది అయిన మీకు ఎన్ని పర్యాయములు శ్రీ కోర్టు వారి ద్వారా నోటీసులు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నందున మీకు నోటీసు అందచేయు నిమిత్తము పేపరు పబ్లికేషన్ కొరకు శ్రీ కోర్టు వారు ఆర్డరు వేసి యున్నారు. కావున ది. 31-07-2025వ తేదిన ఉదయం 10-30 గంటలకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా కాని, ప్లీడరు ద్వారా గాని హాజరై ఆక్షేపణలు ఉన్న యేడల తెలుపుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమున విచారించి తీర్మానించబడునని ఇందు మూలకముగా మీకు తెలియ చేయటమైనది.

వాయిదా తేది 31-07-2025

కె.హరికృష్ణ
వాది తరుపు న్యాయవాది,
తెనాలి,
సెల్: 9440751659.

మహారాజశ్రీ తెనాలి సెకండ్ అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) తెనాలి వారి కోర్టులో
ఓ.ఎస్.నెం. 692/2024

బిట్వీన్
షేక్ కాలేషా వలి .... వాది
ఎదిరి
షేక్ అబ్దుల్ అజీజ్ @ అబ్దుల్ అజీస్ @ అజీస్ .... ప్రతివాది

టు :
షేక్ అబ్దుల్ అజీజ్ @ అబ్దుల్ అజీస్ @ అజీస్
S/o. మోహ్మద్ షా, డోర్ నెం. 16-40, రషీద్
కిరాణా షాపు వద్ద, తేలప్రోలు గ్రామము,
తెనాలి మండలం, గుంటూరు జిల్లా.

పై నంబరు దావాలో వాది మీపై ప్రోనోటు బాకీ వసూలు నిమిత్తము దావా దాఖలు చేసి ప్రతివాది అయిన మీకు ఎన్ని పర్యాయములు శ్రీ కోర్టు వారి ద్వారా నోటీసులు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నందున మీకు నోటీసు అందచేయు నిమిత్తము పేపరు పబ్లికేషన్ కొరకు శ్రీ కోర్టు వారు ఆర్డరు వేసి యున్నారు. కావున ది. 31-07-2025 వ తేదిన ఉదయం 10-30 గంటలకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా కాని, ప్లీడరు ద్వారా గాని హాజరై ఆక్షేపణలు ఉన్న యేడల తెలుపుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమున విచారించి తీర్మానించబడునని ఇందు మూలకముగా మీకు తెలియ చేయటమైనది.

వాయిదా తేది 31-07-2025

కె. హరికృష్ణ
వాది తరుపు న్యాయవాది
తెనాలి,
సెల్: 9440751659.

మహారాజశ్రీ గుంటూరు 4 వ అదనపు సివిల్ జడ్జి సీనియర్ డివిజన్ వారి కోర్టులో
E.P No: 15/2025, Dispute No:12/2021

Between:
M/s. వెంకట తిరుమల చిట్ ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్, నరసరావుపేట.. .... DHR/Petitioner
V/S
నాగండ్ల రాంబాబు మరియు ఇతరులు ....JDR/Respondents

JDR.3) పావులూరి శ్రీనివాసరావు S/o మోహనరావు, వయసు 51 సం॥లు, ప్లాట్ నెం:101, దేవి బృందావనం అపార్ట్ మెంట్, 1వ లైన్, దేవాపురం, గుంటూరు.

పైన తెలియపరచిన Dispute No:12/2021 కు సంబంధించి వెంకట తిరుమల చిట్ ఫండ్ కంపెనీ వారు మీపై గుంటూరు 4వ అదనపు సివిల్ జడ్జి సీనియర్ డివిజన్ వారి కోర్టులో E.P దాఖలు చేసి ఉన్నారు. ఇందుకు సంబంధించి మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు జారీ చేసినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున పై నెంబర్ E.P. 15/2025లో మీకు Under Section 21, Rule 54 (1A) CPC ప్రకారం నోటీసులు జారీ కాగలందులకు గాను ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియపరచవలసిందిగా గౌరవ శ్రీ కోర్టు వారు ఆర్డరు వేసి ఉన్నారు. కావున మీరు ది. 23-07-2025వ తేదీన ఉదయం 10:30 గం.ని లకు శ్రీ పై కోర్టువారి ఎదుట స్వయంగా కానీ లేదా న్యాయవాది ద్వారా కానీ హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమందు తీర్మానించబడునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

వాయిదా ది.23-07-2025

గుంటూరు. **ఇట్లు**
ముత్తవరపు వెంకటేశ్వర్లు చౌదరి,
DHR/PETITIONER తరపు న్యాయవాది,
నరసరావుపేట, సెల్ నెం. 9573423304.

CHANGE OF NAME

I **PAMIDI VENKATESWARA RAO CHOWDARY** (Old Name), S/o Pamidi Parameswararao, D.No. 25-17-510, 1st Line, Srinivasa Rao Thota, Guntur, Guntur District-522003. A.P.
Have changed my name to **PAMIDI VENKATESWARA RAO** Here after my name is known as **PAMIDI VENKATESWARA RAO**

BEFORE THE HONOURABLE DEBTS RECOVERY TRIBUNAL AT VISAKHAPATNAM

Ground & First floor, Sri Narayana Bhawan, Sai Baba Street, Dabagardens, Visakhapatnam-530020.
I.A. 1589/2025 & 1588/2025
IN S.A. 262/2025
Summons under sub section17 (1) of the Act, APPLICATION FILED UNDER SECTION 17 OF SECURITISATION AND RECONSTRUCTION OF FINANCIAL ASSETS AND ENFORCEMENT OF SECURITY INTEREST ACT, 2002

M/s Bhavanam Spinning Mills (P) Limited,
D.No. 4-5-29/143, 2/2 Vidya Nagar,
SBI Officer Colony, Guntur - 522007
& 4 others ..... **Applicants**
And
1. The Authorized Officer, City Union Bank Limited, Credit Recovery and Management Department," NARAYANA" Administrative Office, No. 24-B, Gandhi Nagar, Kumba konam - 612001 & 3 others
.... **Respondents**

To:
R3. Mr. Bhavanam Ramakoti Reddy, S/o. Konda Reddy, D.No. 1-1-773, House no. 27, 2/2 Vidya Nagar, SBI Officer Colony, Guntur - 522007.
R-4. Mrs. Bhavanam Adilakshmi, W/o. Ramakoti Reddy, D.No. 1-1-773, House no. 27, 2/2 Vidya Nagar, SBI Officer Colony, Guntur - 522007.

SUMMONS BY WAY OF PAPER PUBLICATION R3 & R 4

WHEREAS, I.A. 1589/2025 & 1588/2025 IN S.A. 262 /2025 was listed before Hon'ble Presiding Officer/Registrar on 14/08/2025

WHEREAS, this Hon'ble Tribunal is pleased to issue summons/notice on the said Securitization Application under section 17(1) of the Act (SA) with IA filed against you by challenging the actions taken by the respondent bank authorized officer against the property application along with copies of documents etc. annexed).

In accordance with sub-section (1) of section 17 of the Act, you, the respondents/ defendants are directed as under:-

(i) to show cause within thirty days of the service of summons as to why relief prayed for should not be granted;
(ii) to disclose particulars of properties or assets other than properties and assets specified by the applicant under the Securitisation Application.
(ii) you are restrained from dealing with or disposing of secured assets or such other assets and properties disclosed under the Securitization Application, pending hearing and disposal of the application for attachment of properties
(iv) you shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of his business any of the assets over which security interest is created and/or other assets and properties specified or disclosed under the securitization application without the prior approval of the Tribunal.
(v) you shall be liable to account for the sale proceeds realized by sale of secured assets or other assets and properties in the ordinary course of business and deposit such sale proceeds in the account maintained with the bank or financial institutions holding security interest over such assets.

You are also directed to file a written statement, Reply with a copy thereof furnished to the applicant and to appear before presiding Officer/Registrar on 14-08-2025 at 10:30 AM. Failing the application shall be heard and decided in your absence.

Given under my hand and seal of this Tribunal on this the 17th June, 2025

ASSISTANT REGISTRAR DEBTS RECOVERY TRIBUNAL VISAKHAPATNAM

హక్కుల పరిరక్షణ కోసం 9న సమ్మె



మాట్లాడుతున్న వై.రాధాకృష్ణ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా, హక్కుల పరిరక్షణ కోసం 9న దేశవ్యాప్తంగా చేపట్టే సార్వత్రిక సమ్మెలో కార్మికులు, రైతులు, కూలీలు, అన్ని రంగాల ప్రజలు పాల్గొనాలని సిఐటియు పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయులు నాయక్ పిలుపునిచ్చారు. ఈ మేరకు నరసరావుపేట పట్టణం కోటప్పకొండ రోడ్డులోని సిపిఎం కార్యాలయంలో సిఐటియు జిల్లా కోశాధికారి డి.శివకుమారి అధ్యక్షతన శుక్రవారం సదస్సు నిర్వహించారు. ఆంజనేయులు నాయక్ మాట్లాడుతూ కనీస వేతన చట్టం అమలు చేయాలని, 44 కార్మిక చట్టాలను రద్దు చేసి యాజమాన్యాలకు అనుకూలంగా తెచ్చిన 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతన చట్టంతో పాటు అనేక కార్మిక చట్టాలను తొలగించడం దుర్మార్గమన్నారు. కౌలురైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ మాట్లాడుతూ పోరాటం ద్వారా రద్దు చేసిన 3 వ్యవసాయ నల్ల చట్టాలను దొడ్డిదారిన అమలు చేసేందుకు కేంద్రం పూనుకుందని విమర్శించారు. ఉపాధి హామీకి నిధులు కుదింపు సరికాదన్నారు. పంటలకు మద్దతు ధరలు కల్పించాలని, ఎంఎస్ స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయాలని కోరారు. కౌలు రైతుల సంక్షేమం కోసం ప్రత్యేక చట్టాన్ని రూపొందించాలన్నారు. వ్యవసాయ రంగ కార్పొరేటికరణ, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ విధానాలను తిప్పికొట్టడానికి అన్ని గ్రామాలు, పట్టణాల్లో కార్మికులు, కర్షకులు హర్తాళ్లు చేయాలని పిలుపునిచ్చారు. సదస్సులో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ.లక్ష్మీశ్వరరెడ్డి, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు షేక్. సిలార్ మసూద్, ఎల్ఐసి ఏజెంట్స్ యూనియన్ నాయకులు సయ్యద్ రబ్బాని, రోడ్డు అండ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి హరిపోతురాజు, కుల నిర్మూలన పోరాట సమితి నాయకులు కృష్ణ, ప్రగతిశీల కార్మిక సమాఖ్య నాయకులు ఏడుకొండలు, ఇతర నాయకులు మస్తాన్‌వలి, సుభాష్ చంద్రబోస్ పాల్గొన్నారు.



ప్రజాశక్తి - క్రోసూరు

స్థానిక గాంధీ బొమ్మల వద్ద భవన నిర్మాణ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో సమ్మె కరపత్రాలను పంపిణీ చేశారు. సిఐటియు నాయకులు టి.హనుమంతరావు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు అండగా ఉన్న సంక్షేమ బోర్డును రద్దు చేయడం ద్వారా పథకాలను వారికి దూరం చేశారని రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించారు. 1214 మెమోను రద్దు చేయాలన్నారు. కార్మికులకు సొంత ఇంటి నిర్మాణానికి రుణాలు, పిల్లల చదువులకు స్కాలర్‌షిప్‌లు, ఇవ్వడంతోపాటు పెండింగ్ క్లెయిములను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వీటి సాధన కోసం చేపట్టే సమ్మెలో కార్మికులంతా భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో సిహెచ్.ఏషియ్య, బి.కొండలరావు, కె.మల్లికార్జునరావు, నాగేశ్వరావు పాల్గొన్నారు.



ప్రజాశక్తి-పిడుగురాళ్ల

స్థానిక కన్నెగంటి హనుమంతు భవనంలో కార్మిక సంఘాల సమావేశం ఒ.కృష్ణ అధ్యక్షతన జరిగింది. సిఐటియు మండల కార్యదర్శి టి.శ్రీనివాసరావు మాట్లాడారు. ఉపాధి హామీ కింద 200 రోజుల పని కల్పించాలని, పట్టణానికి దీన్ని విస్తరించాలని, కార్మికులు కనీస వేతనం రూ.26 అమలుతోపాటు ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రభుత్వ రంగాన్ని బలోపేతం చేయాలనే డిమాండ్లతో సమ్మె జరుగుతుందన్నారు. ఎఐఎఫ్‌టియు నాయకులు కె.చెన్నయ్య మాట్లాడుతూ కార్మిక హక్కులను మోడీ ప్రభుత్వం కాలరాస్తోందని, పంటలకు ధర కల్పించకుండా రైతులను ఆత్మహత్యలకు పురిగొల్పుతోందని విమర్శించారు. పని గంటలను పెంచి యజమానులకు లాభాలు చేకూర్చే విధానాలను అవలంబిస్తోందని, వీటిని తిప్పికొట్టాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఒ.కృష్ణ మాట్లాడుతూ సామాన్యుడికి ధరల భారము పెరిగి అల్లాడుతున్నాడని చెప్పారు. అనంతరం సమ్మె ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. పుల్లారెడ్డి, మల్లికార్జున్‌రావు, ఎస్.వెంకటకృష్ణ, బి.కొండలు పాల్గొన్నారు.



ప్రజాశక్తి - అచ్చంపేట

లేబర్ కోడ్‌ల రద్దు, కనీస వేతనాల అమలు, ప్రభుత్వ రంగ బలోపేతం కోసం సాగే సమ్మెలో అన్ని రంగా కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని అంగన్వాడీ యూనియన్ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.మల్లీశ్వరి పిలుపునిచ్చారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో గ్రామపంచాయతీ కార్మికులు, ఆశా వర్కర్లు, అంగన్వాడీ టీచర్లు, విఆర్ఎల యూనియన్ల సమావేశం నిర్వహించారు. మల్లీశ్వరి మాట్లాడుతూ విద్యుత్, రవాణా, బ్యాంకింగ్, బీమా తదితర రంగాలను ప్రైవేటుపరం చేయడానికి కేంద్రం పూనుకుందని, విశాఖ స్టీల్‌నూ అమ్మజూస్తోందని విమర్శించారు. ప్రభుత్వ రంగాన్ని కాపాడుకునేందుకు, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం సాధించడానికి కార్మిక వర్గం ఐక్యంగా సమ్మెలో పాల్గొనాలన్నారు. అనంతరం అధికారులకు పంచాయతీ కార్మికులు సమ్మె నోటీసును అందించారు. వివిధ సంఘాల నాయకులు టి.హనుమంతరావు, ఆర్.వెంకటేశ్వర్లు, కెకె రెడ్డి పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికుల సమస్యలపై నిరసన



ప్రజాశక్తి - పిడుగురాళ్ల

ఏపీఎస్ ఆర్టీసీ ఉద్యోగ, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లాలోని పలు డిపోల్లో శుక్రవారం నిరసనలు చేపట్టారు. ఇందులో భాగంగా పిడుగురాళ్ల డిపో వద్ద ఏపీపీటీడీ ఎంప్లాయీస్ యూనియన్ ఎర్ర బ్యాడ్జీలు ధరించి చేసిన నిరసనలో నాయకులు ఆర్టీసీ ఉద్యోగులందరికీ ఆరేళ్లగా పెండింగ్లో ఉన్న ప్రమోషన్లు వెంటనే ఇవ్వాలని, ఖాళీగా ఉన్న 10 వేల మంది సిబ్బంది నియామకాలను వెంటనే చేపట్టాలని కోరారు. ఎలక్ట్రిక్ బస్సులను ఆర్టీసీ సొంతంగా కొనుగోలు చేయాలని, 12వ పిఆర్‌సి కమిషన్ వెంటనే నియమించాలని కోరారు. కాలం చెల్లిన బస్సుల బ్రేక్డౌన్‌కు గ్యారేజ్ సిబ్బందిని బాధ్యులు చేసే విధానాన్ని నిలిపేయాలన్నారు. కారుణ్య నియామకాలు చేపట్టాలని, ఉద్యోగులపై యాజమాన్యం ఒత్తిడి తగ్గించాలని డిమాండ్ చేశారు. నాయకులు కె.శ్రీనివాసరావు, షేక్ దస్తగిరి, ఒ.సుశీల, అమీర్ హమ్జా, వరప్రసాద్, శ్రీనివాసరావు, రామారావు, రాజారాం పాల్గొన్నారు.



ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

ఆర్టీసీ ఉద్యోగులకు ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ట్రాన్స్పోర్ట్ డిపార్ట్మెంట్ ఎంప్లాయిస్ యూనియన్ సత్తెనపల్లి డిపో అధ్యక్షులు ఎన్‌బికె సాహెబ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక డిపోలో మధ్యాహ్నం భోజన విరామం సమయంలో గేట్ మీటింగ్ ద్వారా నిరసన తెలిపారు. బి.భాస్కర్, జవహర్, యేసయ్య, హుస్సేన్, రమణారెడ్డి, కిరణ్‌కుమార్, యల్లమంద పాల్గొన్నారు.

ప్రజాశక్తి-చిలకలూరిపేట

స్థానిక డిపోలో గేట్ మీటింగ్ నిర్వహించగా డిపో సెక్రటరీ ఎ.వరప్రసాద్ మాట్లాడారు. బి.కోటేశ్వరరావు, పి.కృష్ణ, సైదావలి, థామస్, ఎం.సుబ్బారావు, సాయి, జి.రవిబాబు, కె.కె.రావు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.





మాట్లాడుతున్న ఐద్వా పట్టణ అధ్యక్షులు మునగ జ్యోతి

ఆడపిల్లలకు ఆస్తి హక్కు కోసం పోరాడిన సూర్యావతి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్ : ఆడపిల్లల ఆస్తి హక్కు కోసం, మద్యపానం నిషేధం కోసం సూర్యావతి పోరాడారని ఐద్వా పల్నాడు జిల్లా కార్యదర్శి జి.రజిని అన్నారు. ఐద్వా నాయకులు మానుకొండ సూర్యావతి వర్ధంతి సభను సత్తెనపల్లి పట్టణంలో పట్టణ అధ్యక్షులు ఎం.జ్యోతి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యావతి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రాష్ట్ర కమిటీ సభ్యులు జి.ఉమశ్రీ మాట్లాడుతూ ఇంటింటికి మరుగుదొడ్ల కోసం, సంపూర్ణ మద్యపానం నిషేధం కోసం సూర్యావతి పోరాడారని చెప్పారు. శాసన మండలి సభ్యురాలుగానూ ప్రజల కోసం పాటుపడ్డారన్నారు. మద్యం వలన రోజురోజుకు మహిళలపై అత్యాచారాలు దాడులు జరుగుతున్నాయని అన్నారు. చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. రేషన్ దుకాణాల ద్వారా కేరళ తరహాలో 16 రకాల సరుకులు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం ఐద్వా జనరల్ బాడీ సమావేశంలో వార్డు కమిటీని ఎన్నుకున్నారు. నాయకులు డి.విమల, సుధారాణి, లక్ష్మి, అనురాధ, అనంతలక్ష్మి మల్లేశ్వరి, జ్యోతి, భవాని, ఉమామహేశ్వరి భారతి, కౌలురైతు సంఘం నాయకులు పి.మహేష్ పాల్గొన్నారు.



అల్లూరి, పింగళి వెంకయ్యకు నివాళి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

స్వాతంత్ర్య సమరయోధులైన అల్లూరి సీతారామరాజు జయంతి, జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య వర్ధంతి సందర్భంగా నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో నివాళు లర్పించారు. వారి చిత్రపటాలకు జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే ధనుంజయ్ పూల మాలలేశారు. జిల్లా రెవిన్యూ అధికారి మురళి, ఆర్డీఓ కె.మధులత పాల్గొన్నారు.

అందరూ సోదరభావంతో మెలగాలి : ఎస్పీ

ప్రజాశక్తి - నరసరావుపేట



మొహరం వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని పల్నాడు జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. ఎవరైనా గొడవలకు దిగితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అందరూ సోదరభావంతో మెలగాలని సూచించారు. ఇప్పటికే పలుచోట్ల బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి పరిశీలించాలి

ప్రజాశక్తి- రెంటచింతల

బియ్యం కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న వారి ఇంటింటికి విఆర్వోలు వెళ్లి క్షుణ్ణంగా పరిశీలించాలని తహశీల్దార్ మేరీ కనకం ఆదేశఇంచారు. విఆర్ఒలతో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పులు తొలగింపు చిరునామా మార్పు నూతన కార్డులు కావాలని మొత్తం 2852 దరఖాస్తులు వచ్చాయని, వాటిని సత్వరం పరిశీలించాలని ఆదేశించారు.

అధ్యాపక పోస్టులకు 21న ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి - విజయపురిసౌత్

స్థానిక ఏపీఆర్ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న గెస్ట్ లెక్చరర్ పోస్టులను భర్తీ చేస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.నయింభాను శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంస్కృతం-1, హిస్టరీ-1, కామర్స్-2, కంప్యూటర్ సైన్స్-2, కెమిస్ట్రీ-1, జువాలజీ-1 పోస్టుల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆసక్తి ఉన్నవారు ఒర్జినల్ సర్టిఫెకెట్లతో ఈ నెల 11వ తేదీ ఉదయం 11గంటలకు కళాశాలలో జరిగే ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు. పోస్ట్ గ్రాడ్యుయేషన్లో 55 శాతం ఉత్తీర్ణత కలిగి ఉండాలని, పీహెచ్‌ఎ, యుజీసీ నెట్, సెట్ కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యం ఉంటుందని, ఇంగ్లీషు మీడియంలో బోధన చేయగలిగి ఉండాలని పేర్కొన్నారు. మరిన్నీ వివరాల కోసం 8688169290 నంబరుకు సంప్రదించాలని సూచించారు.

పంపిణీకి 47265 భూమి యాజమాన్య హక్కు పత్రాలు సిద్ధం : జెసి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లాలో రీ- సర్వే జరిగిన యడ్లపాడు, చిలకలూరిపేట, నకరికల్లు, నాదెండ్ల, నరసరావుపేట, నూజెండ్ల, పెదకూరపాడు, రొంపిచర్ల, శావల్యాపురం గ్రామాల రైతులకు భూమి యాజమాన్య హక్కు పత్రాలు, పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నట్లు జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరే శుక్రవారం తెలిపారు. తొమ్మిది మండలాలకు గాను 47,265 భూమి యాజమాన్య హక్కు పత్రాలు, పట్టాదారు పాస్ పుస్తకాలు సిద్ధం చేశామన్నారు.

సార్వత్రిక సమ్మెకు సర్వత్రా మద్దతు





తాడేపల్లిలో

ప్రజాశక్తి- తాడేపల్లి

9వ తేదీన జరగబోయే దేశవ్యాప్త కార్మిక సమ్మెలో రవాణా రంగ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని సిఐటి యు తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు కోరారు. శుక్రవారం తాడేపల్లి లో ఉన్న ఆటో, లారీ,ఇతర వాహనాల డ్రైవర్లు ఈ సమ్మెను జయప్రదం చేయాలని కరపత్రాలు పంపిణీ చేశా రు. తాడేపల్లి లో మహాలక్ష్మి ట్రాన్స్పోర్ట్,లారీ డ్రైవర్లతోనూ మణిపాల హాస్పిటల్ లో ఉన్న ఆటో స్టాండ్ కార్మికులతోనూ జరిగిన గ్రూపు సమావేశాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. జూలై 9వ తేదీన తాడేపల్లి సాయిబాబా గుడి వద్ద నుండి కార్మిక ప్రదర్శనజరుగుతుందని,ఈ ప్రదర్శనలో యావన్మంది కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని దుర్గారావు కోరారు. ఈ కార్యక్రమంలో రాజేశ్వరరావు, నాగేశ్వరరావు, చిన్నారావ్,తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి- తాడేపల్లి : సమ్మెను జయప్రదం చేయాలని తాడేపల్లి లోని బ్రహ్మానందపురంలో బిఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఎసిసి కార్మికులు భవన నిర్మాణ కార్మికులతో ప్రజాశక్తి ప్రచురించిన ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. కార్మికుల్లో విస్తతంగా ప్రచారం చేశారు. కార్యక్రమంలో నాయకులు వేముల దుర్గారావు, వెంకటేశ్వర్లు, కూరపాటి స్టీవెన్, సూర్య ప్రకాష్, పిచ్చయ్య, రమాదేవి,నవనీతం, నాగేశ్వరరావు, మల్లేశ్వరి, గురవయ్య, సాంబయ్య, సుభాని, అంకయ్య, సుబ్బారావు,తదితరులు పాల్గొన్నారు.



దుగ్గిరాలలో

ప్రజాశక్తి - దుగ్గిరాల

దేశవ్యాప్తంగా నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి చింతల శ్రీనివాసరావు కోరారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ వర్కర్స్ జనరల్ బాడీ సమావేశాన్ని నిర్వహించారు. పి నరసింహారావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సిఐటియు మండల కార్యదర్శి జి శ్రీనివాసరావు రాహులు సుబ్బయ్య కోటి వెంకటేశ్వర్లు రాఘవ పాల్గొన్నారు. అనంతరం గ్రామ కార్యదర్శి వివేకనందకు సమ్మె నోటీసు అందజేశారు

ప్రజాశక్తి - తాడికొండ

9న జరిగే సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు ఎడ్లపల్లి గాంధీ రామ్మోహన్రావు, రైతు సంఘ నాయకులు చింతల భాస్కరరావు, పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు నూతక్కి వీరయ్య శుక్రవారం కోరారు. ఈ మేరకు పొన్నెకల్లు పంచాయతీ కార్యదర్శి షేక్ జానీ ,మండల పరిషత్తు అధికారికి సమ్మె నోటీసులు అందజేశారు.



తాడికొండలో

స్మార్ట్ మీటర్లను వద్దన్నారు...

ప్రజాశ క్తి - తాడేపల్లి

తాడేపల్లి బైపాస్ రోడ్‌లోని విఆర్ అపార్ట్మెంట్లో స్మార్ట్ మీటర్ బిగించడానికి సిబ్బందితో కలిసి స్థానిక విద్యుత్ సిబ్బంది శుక్రవారం అక్కడ చేరుకున్నారు. విషయం తెలుసుకున్న అపార్ట్మెంట్ వాసులు స్మార్ట్ మీటర్లు బిగించవద్దని అడ్డుకున్నారు. చేసేదేమి లేక సిబ్బంది వెనుదిరిగి వెళ్ళిపోయారు.



సమస్యల పరిష్కారం కోసం జనరల్ ఇన్సూరెన్స్ పెన్షనర్లు నిరసన

ప్రజాశక్తి-గుంటూరు

జనరల్ ఇన్సూరెన్స్ పెన్షనర్లు, కుటుంబ పెన్షనర్లకు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యల కోసం అఖిల భారత డిమాండ్ల దినోత్సవం సందర్భంగా శుక్రారం గుంటూరు, అరండల్‌పేటలోని యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ వద్ద జనరల్ ఇన్సూరెన్స్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన నిరసన కార్యక్రమం నిర్వహించారు. అసోసియేషన్ చైర్మన్ చింతల ఆనంద్ మాట్లాడుతూ ఏకరీతి 30 శాతం కుటుంబ పెన్షన్ ఇవ్వాలని, పెన్షన్ అప్‌డేషన్ చేయాలని, ఎల్ఐసితో సమానంగా పనిచేసే ఉద్యోగులకు తక్షణ వేతన సవరణ చేయాలని, పెండింగ్‌లో ఉన్న అన్ని పెన్షనర్ సంబంధిత సమస్యలు పరిష్కరించాలని కోరారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో స్టేట్ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ మన్నవ సాంబశివరావు, అమరావతి యూనిట్ తరపున ప్రెసిడెంట్ ఎస్.వి .సుబ్బారావు, సెక్రెటరీ మట్ట రవి కుమార్, ఇతర యూనిట్ నాయకులు, పెన్షనర్లు పాల్గొన్నారు.



సూర్యావతి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఐద్వా, ఇతర ప్రజా సంఘాల నాయకులు

మహిళల్లో చైతన్యం నింపిన ధీరవనిత సూర్యావతి

ప్రజాశక్తి-గుంటూరు

మహిళా ఉద్యమ నేత, ఆదర్శ కమ్యూనిస్టు మానికొండ సూర్యావతి 32వ వర్ధంతి శుక్రవారం బ్రాడీపేటలోని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు కె.పద్మ అధ్యక్షతన నిర్వహించారు. సూర్యవతి చిత్రపటానికి ఐద్వా జిల్లా కార్యదర్శి ఎల్. అరుణ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అరుణ మాట్లాడుతూ మానికొండ సూర్యావతి స్వాతంత్ర్య ఉద్యమంలో మహిళలను చైతన్యవంతం చేసి, మహిళా సంఘాన్ని నిర్మించారన్నారు. పట్టణ ప్రాంతాల్లోనే కాకుండా గ్రామీణ మహిళలను కూడా చైతన్యపరిచి స్త్రీలకు విద్యా సౌకర్యాలు కల్పించాలని, పురుషులతో సమానంగా కూలి ఇవ్వాలని, ఆస్తిహక్కు కల్పించాలని, మరుగుదొడ్లు నిర్మించాలని, ప్రసూతి ఆసుపత్రులు నిర్మించాలని ఆమె పెద్ద ఎత్తున పోరాటం చేశారన్నారు. సరళీకరణ ఆర్థిక విధానాలు, మతోన్మాద విధానాల ఫలితంగా మహిళల అభివృద్ధి కుటుపడుతుందన్నారు. ఈ నేపథ్యంలో సూర్యావతి స్ఫూర్తితో పోరాడాలని పిలుపునిచ్చారు. పాత గుంటూరు శ్రామిక నగర్, కోబాల్డ్‌పేట, దేవాపురంలో సూర్యావతి వర్ధంతి కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమంలో ఐద్వా నగర కార్యదర్శి ఏ. కళ్యాణి, అధ్యక్షులు జి.రమణ. కె.పద్మ, నందిని, తిరుపతమ్మ, అంకమ్మ, శివమ్మ పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం హామీలను అమలు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి, పెదనందిపాడు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాశం రామారావు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో సిపిఎం మండల కమిటీ సమావేశం మండల సహాయ కార్యదర్శి కొత్త వెంకటశివరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ తెలుగుదేశం నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం దాటిందని, కానీ వారు ప్రజలకు ఇచ్చిన హామీలు ఒకటి, అర తప్ప పూర్తిగా అమలు చేయలేదని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీని ఇంతవరకు అమలు చేయలేదని, నిరుద్యోగ భృతి ఊసే లేదని, అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు ఇస్తానన్న పెట్టుబడి సాయం ఇంతవరకు అందలేదని, కౌలు రైతులకు భూ యజమాని సంతకంతో సంబంధం లేకుండా పంట రుణాలు ఇస్తామని, ఆ ప్రకారం కౌలు రైతు చట్టాన్ని మారుస్తామని హామీ ఇచ్చిన ఇంతవరకు అమలు జరగలేదని, ఇబ్బడి ముబ్బడిగా మద్యం అమ్మ కాలు పెరిగిపోయాయని, మద్యాన్ని ఆదాయ వనరుగా చూస్తున్నారని తెలిపారు. సూపర్ సిక్స్ పథకాల అమలు మరచారని విమర్శించారు. ప్రతి సంవత్సరం జనవరి నెలలో జాబ్ క్యాలెండర్ విడుదల చేసి పోస్టులు భర్తీ చేస్తామని హామీ ఇచ్చారని, జులై నెల వచ్చిన జాబ్ క్యాలెండర్ విడుదల చేయలేదన్నారు. అదేవిధంగా విద్యుత్ చార్జీల భారాన్ని ప్రజల మీద మోపారని తెలిపారు. కార్పొరేట్లకు దాసోహం అవుతూ ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ను స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ గా మార్చి కార్పొరేట్ల సేవలో తరించిపోతున్నారని తెలిపారు. ఉపాధి హామీ చట్టానికి కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయింపులు తగ్గించినా, రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కార్మిక చట్టాలను సవరించి 8 గంటల పని విధానాన్ని మార్చి 12 గంటలకు పెంచారని, కార్మిక వర్గాన్ని కార్పొరేట్ కంపెనీల ముందు బానిసలుగా మారుస్తున్నారని తెలిపారు. ఈ విధానాలను సిపిఎం పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని, హామీలు అమలు చేయకపోతే భవిష్యత్తులో పోరుబాట పడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం పెదనందిపాడు మండల కార్యదర్శి దొప్పలపూడి రమేష్ బాబు, నాయ కులు జంపని రామారావు, ముద్దన వెంకటేశ్వర్లు, దేవరకొండ శ్రీనివాసరావు, కాపు వెంకట సుబ్బారావు, నల్లమోతు రాజేంద్ర, పోపూరి సుధీర్, మర్రి లక్ష్మి, పి భువనేశ్వరి, షేక్ షమీ తదితరులు పాల్గొన్నారు. అనంతరం 'దారి తప్పుతున్న కూటమి ఏడాది పాలన' పుస్తకాన్ని ఆవిష్కరించారు.



నివాళులర్పిస్తున్న ఎం రవి తదితరులు

సిపిఎం అభిమాని గాదె రామకోటిరెడ్డి మృతి

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్



రాజధాని లోని నిడమర్రు లో సిపిఎం అభిమాని గాదే రామ కోటిరెడ్డి(103) గురువారం రాత్రి మృతి చెందారు. ఈయన భార్య గతంలోనే చనిపోగా ఇద్దరు మగపిల్లలు ఒక కుమార్తె ఉన్నారు. కడదాకా కమ్యూనిస్టుగా జీవించిన గాదే రామ కోటిరెడ్డి తాను చనిపోయిన తర్వాత ఎర్రజెండా కప్పి తన అంత్యక్రియలు నిర్వహించాలని కుటుంబ సభ్యులకు స్పష్టంగా తెలిపిన కమ్యూనిస్టు రామకోటి రెడ్డి మృతికి సిపిఎం రాజధాని డివిజన్ కమిటీ తీవ్ర సంతాపాన్ని తెలిపింది. సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం రవి సిపిఎం నేతలు ఆయన కోరిక మేరకు సిపిఎం జెండాను ఆయన మృతదేహంపై కప్పి జోహార్లు అర్పించారు. ఆయన మతికి తీవ్ర సంతాపాన్ని తెలుపుతూ, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి నీ తెలిపారు. శుక్రవారం నాడు రామకోటి రెడ్డి అంత్యక్రియలు నిడమర్రు లో జరిగాయి. అంత్యక్రియలలో సిపిఎం రాజధాని డివిజన్ నాయకులు ఎం భాగ్యరాజు, డివిజన్ నాయకులు గైరుబోయిన నాగేశ్వరరావు, కట్టె పోగు ప్రకాశరావు, జొన్నల శంకర్ రెడ్డి, విప్పల శివారెడ్డి, కట్టె పోగు బుల్లబ్బాయి, కైలా స్టాలిన్, కట్టేపోగు నాగేశ్వరరావు, ఎం రాజ ముని, ఏం ప్రసన్నకుమార్, తాడేపల్లి పట్టణ సిపిఎం నాయకులు గాదె సుబ్బారెడ్డి, బి దశరథ రామిరెడ్డి, స్థానికులు భీమిరెడ్డి సుబ్బారెడ్డి, సిపిఐ ఎంఎల్ నాయకులు దండా ప్రసాద్ రెడ్డి, టిడిపి నాయకులు గాదె లక్ష్మారెడ్డి, కుర్రా బ్రహ్మం, వైసీపీ నాయకులు మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు న్యాయం జరగకుంటే ఉద్యమిస్తాం

పసుపు రైతుల సంఘం ఏకగ్రీవ తీర్మానం

ప్రజాశక్తి-తెనాలి కోల్డ్ స్టోరేజ్‌లో సంబంధించిన అగ్ని ప్రమాదంలో నష్టపోయిన రైతులకు న్యాయం జరగకుంటే రైతుల పక్షాన ఉద్యమం చేస్తామని రాష్ట్ర పసుపు రైతుల సంఘం కన్వీనర్ జొన్న శివశంకరరావు హెచ్చరించారు. దుగ్గిరాల శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజ్‌లో సంభవించిన అగ్ని ప్రమాదంలో నష్టపోయిన పసుపు రైతులకు పరిహారం దక్కకపోవడం పై శుక్రవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా గల ఎస్ డబ్ల్యూ ఎఫ్ కార్యాలయంలో కన్వీనర్ వేములపల్లి వెంకట్రామయ్య అధ్యక్షతన సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న శివశంకరరావు మాట్లాడుతూ 2024 జనవరి 19న దుగ్గిరాల శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజ్ లో అగ్ని ప్రమాదం జరిగిందన్నారు. ఫలితంగా సుమారు లక్ష బస్తాలు కాలిపోవడంతో రూ.100 కోట్ల మేర ఆస్తి నష్టం జరిగిందన్నారు. గత సంవత్సరం వ్యవసాయ మంత్రి అచ్చం నాయుడు సమక్షంలో విజయవాడ మార్క్ఫెడ్ ఆఫీసులో క్వింటాల్ కి రూ.7 వేలు పరిహారం చెల్లిస్తామని ఇచ్చిన హామీ నెరవేరలేదన్నారు. తిరిగి జూన్ నెల 12వ తేదీన గుంటూరు వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయంలో కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర రావు సమక్షంలో జూన్ నెలాఖరు లోపల రైతులకు స్లిప్పులు అందజేయటం జరుగుతుందని చెప్పిన హామీ కూడా అమలు కాలేదన్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ను కలిసి, పరిష్కారం దక్కకుంటే నిరాహార దీక్షలు చేపడతామన్నారు. వేములపల్లి వెంకట్రామయ్య మాట్లాడుతూ అగ్ని ప్రమాదం జరిగిన 17 నెలలు కావస్తుందని,



మాట్లాడుతున్న జొన్న శివ శంకరరావు

ప్రజాప్రతినిధులు అధికారులు చుట్టూ 13 సార్లు రైతాంగం కలవడం జరిగిందని తెలిపారు. ప్రమాదం జరిగినప్పుడు క్వింటాల్ కు రూ. 14వేలు చెల్లించాలని డిమాండ్ చేస్తే కేవలం రూ. 7 వేలకు ఒప్పుకున్న ప్రభుత్వం, ఇప్పటికైనా రైతులకు న్యాయం చేయాలని కోరారు. రైతులు ఒప్పందం చేసుకున్నారని తెలిపారు. సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ములకా శివ సాంబిరెడ్డి మాట్లాడుతూ కమిటీల పేరుతో ప్రభుత్వం కాలయాపన చేయకుండా సత్వరమే బాధిత పసుపు రైతులకు పరిహారం ఇచ్చేందుకు చర్యలు తీసుకోని పక్షంలో రైతాంగం ఆందోళనకు సిద్ధంగా ఉండాలని కోరారు. సమావేశంలో గుళ్ళపలి వెంకట సుబ్బారావు, లంకిరెడ్డి నాగేశ్వర్ రెడ్డి, నాదెళ్ల చంద్రశేఖర రావు, పోతరాజు కోటేశ్వరరావు, ఎన్ సురేంద్ర, ఆళ్ల వేణుగోపాల్ రెడ్డి, కె సాయిరాం రెడ్డి, ఎం సాంబశివరావు, రాజేష్, భాస్కర్ రెడ్డి, ఎస్ శ్రీరామ్ మూర్తి, కే శేషు ప్రసాద్, ఏ గోవిందరెడ్డి, గుదిబండి కృష్ణారెడ్డి పాల్గొన్నారు

ప్రజా నాయకుడు వంగవీటి

ప్రజాశక్తి - మాచర్ల

ప్రజల నుండి పుట్టిన మహానాయకుడు వంగవీటి మోహన రంగా మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్ మదార్‌సాహెబ్ అన్నారు. శుక్రవారం వంగవీటి రంగా జయంతిని పురస్కరించుకొని పట్టణంలోని మెయిన్‌రోడ్డులో గల రంగా విగ్రహానికి మదార్‌సాహెబ్, టిడిపి పట్టణ అధ్యక్షులు కొమెరా దుర్గారావులు పూలమాలలు వేసి ఘనంగా నివాళలు అర్పించారు. ఈ కార్యక్రమంలోటిడిపి సీనియర్ నాయకులు ఎనుముల కేశవరెడ్డి, మాజీ మార్కెట్ యాడ్ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు, మద్దిగపు చిన్న వెంకటరామి రెడ్డి, కజ్జం సైదయ్య, పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

వంగవీటి 78వ జయంతి వేడుకలు సత్తెనపల్లి పట్టణంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వడ్డవల్లి పోలేరమ్మ తల్లి గుడి వద్ద కాపు నాయకులు బుడగాల సుబ్బారావు ఆధ్వర్యంలో టిడిపి నాయకులు యెల్లినేడి రామస్వామి, చౌటా శ్రీనివాసరావు, కంభాల వెంకటేశ్వరరావు పట్టణ అధ్యక్షులు షేక్ మస్తాన్ వలిలు రంగా విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో దివ్వెల శ్రీనివాసరావు, షేక్ జానీ, తదితరులు నివాళులర్పించారు.

స్వామి వివేకానందకు ఘన నివాళులు

ప్రజాశక్తి - మాచర్ల

శ్రీరామకృష్ణ సేవా సమితి మాచర్ల వారి ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని అండ్ బి బంగ్లా ఎదురుగా ఉన్న వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రామకృష్ణ సేవా సమితి అధ్యక్షులు మెట్టు గోవింద రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాచర్ల పట్టణ ఎస్ఐ జి.సంధ్యారాణి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివేకానందుడు కలలుగన్న నవభారత నిర్మాణానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ రామకృష్ణ సేవా సమితి సెక్రటరీ పోలిశెట్టి పుల్లారావు, సహాయ కార్యదర్శి కొమర కాశి, షేక్ చిన లాలు సాహెబ్, ముత్యాల పాపి రెడ్డి, రామాంజి , గుంటూరు ప్రభావతి, కంచర్ల జగన్, ఇ. హరిబాబు, ఆర్టీసీ శ్రీనివాసరావు, పల్నాడు జూనియర్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.



శిక్షణలో పాల్గొన్న ఆరోగ్య సిబ్బంది

ఫ్లోరోసిస్ వ్యాధి సర్వేపై శిక్షణ

ప్రజాశక్తి - క్రోసూరు

ఫ్లోరోసిస్ వ్యాధి సర్వేపై ఆరోగ్య విస్తరణ అధికారులకు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లకు డాక్టర్ గిరిధర్ కుమార్ డిస్టిక్ కన్సల్టెంట్ ఎన్సీడీ వారి ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అచ్చంపేట, క్రోసూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బందికి శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ గిరిధర్ మాట్లాడుతూ మామూలుగా ఫ్లోరైడ్ భూగర్భ జలాలలో నదీ జలాలు, పారే నీటిలో ఆహార పదార్థాలలో ఆకుకూరలు పండ్లు కూరగాయలు ఫ్లోరైడ్ కలిగిన మందులలో టీ, కాఫీలలో పారిశ్రామిక వ్యర్థాలులో టూత్ పేస్టలలో ఎక్కువగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య అధికారులు షాద్, సిరిచందన, రాంబాబు నాయక్, ఆరోగ్య విస్తరణ అధికారులు శిఖా శాంసన్, పి.వెంకట్రావు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

సోమవారం నుండి ప్రజాదర్బార్

ప్రజాశక్తి - మాచర్ల

సోమవారం నుండి శనివారం వరకు స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పార్టీ ఇన్‌చార్జి డాక్టర్ యరమల రామచంద్రారెడ్డి తెలిపారు. పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డి.శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, గాదే పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.









అల్లూరికి నివాళులర్పిస్తున్న చిలకలూరిపేట, మాచర్ల మున్సిపల్ కమిషనర్లు, పెదకూరపాడులో నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, దుర్గిలో నినాళులర్పిస్తున్న తహశీల్దార్

మాతృ భూమి కోసం ప్రాణాలర్పించిన మహనీయుడు అల్లూరి

ప్రజాశక్తి-చిలకలూరిపేట

మాతృభూమి కోసం ప్రాణాలర్పించిన మహనీయుడు అల్లూరి సీతారామరాజు అని కమిషనర్ పి.శ్రీహరిబాబు కొనియాడారు. శుక్రవారం అల్లూరి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి కమిషనర్ నివాళులర్పించారు. కమిషనర్ మాట్లాడుతూ ఆయన సాయుధ పోరాటం ద్వారానే స్వతంత్రం వస్తుందని నమ్మకంతో, దానికోసం బ్రిటిష్ పాలకులను ఎదురొడ్డి పోరాడిన విప్లవ యోధుడన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డిఈ అబ్దుల్ రహీం, రెవెన్యూ ఆఫీసర్ పి.సుబ్బారావు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గిరిబాబు, మేనేజర్ మొహిద్దీన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ చేరెడ్డి రమణారావు. టౌన్ ప్లానింగ్, మెప్మా, ఇంజనీరింగ్, తదితర మున్సి పల్ అధికారులు పాల్గొన్నారు.

గిరిజన సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో

ఏపీ గిరిజన సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో అల్లూరి జయంతి ఘనంగా నిర్వహించారు. ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు బి.శ్రీను నాయక్, పట్టణ గౌరవ అధ్యక్షులు బి.చిన్ననాయక్, కౌన్సిలర్ వి.కోటానాయక్, బీసీ నాయకులు పుట్టా వెంకట బుల్లోడు, యం. వెంకటేష్ నాయక్, ఆర్ హరి నాయక్, బి.శివ నాయక్, డి.వెంకట్, తోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మాచర్ల

మన్యం వీరుడు అల్లూరి సీతారామారాజు అచరించిన ప్రశ్నించే ధైర్యాన్ని నేటి తరం అలవర్చుకోవాలని కమీషనర్ డి.వేణుబాబు కోరారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో అల్లూరి సీతారామారాజు జయంతిని ఘనంగా నిర్వహించారు. అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఏఈ గౌతమి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వెంగయ్య, సిబ్బంది మహాలక్ష్మీ, విజయలక్ష్మీ, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

భారతీయ యువతకు స్ఫూర్తి ప్రదాతలు శ్రీ స్వామి వివేకానంద, అల్లూరి సీతారామరాజులని శ్రీరామకఅష్ణ సేవాసమితి అధ్యక్షులు మెట్టు గోవిందరెడ్డి అన్నారు. స్వామి వివేకానంద వర్ధంతిని, అల్లూరి సీతారామారాజు జయంతిని పురస్కరించుకొని మండలంలోని కంభంపాడు గ్రామంలోని బస్టాండ్ సెంటర్లో గల స్వామి వివేకానంద విగ్రహానికి, సీతారామరాజు చిత్రపటానికి కంభంపాడు గ్రామ పెద్దలతో కలసి గోవిందరెడ్డి పూలమాలవేసి ఘన నివాళులు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో చుండూరి కొండలు, కపలవాయి పెదనరసింహారావు, చుండూరు సీతయ్య, కంచర్ల జగన్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పెదకూరపాడు

మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు ఆశయాలను నేటితరం కొనసాగించాలని విజయ విద్య విహార్ హైస్కూలు ప్రధానోపాధ్యాయులు నోముల కోటేశ్వరరావు కోరారు. శుక్రవారం పెదకూరపాడు కచేరి సెంటర్లో పెదకూరపాడు అభివృద్ధి వేదిక (పిడిఎఫ్) ఆధ్వర్యంలో సీతారామరాజు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజా కవి దర్శి శేషారావు, రిటైర్ ప్రధాన ఉపాధ్యాయులు గుత్తా వెంకటేశ్వర్లు, కాల్వ అప్పారావు, కరిముల్లా, సంజీవరావు, రామనాథం, వెంకటేశ్వర్లు, నరసింహారావు, శ్రీను, రత్నబాబు, జానీ, సైదా పాల్గొన్నారు.



అల్లూరి సీతారామరాజు, స్వామీ వివేకానంద చిత్రపటాలకు నివాళులు అర్పిస్తున్న హెల్ప్‌ఫౌండేషన్ అధ్యక్షులు కంచెర్ల

ప్రజాశక్తి - రెంటచింతల

దేశభక్తికి త్యాగనిరతకి మారుపేరైన అల్లూరి సీతారామ రాజు త్యాగాలను బాలలకు బాగా అర్థమయ్యేలా బోధించాలని పలువురు టీచర్లు కోరారు. శుక్రవారం అల్లూరి 128వ జయంతి సందర్భంగా రెంటచింతలలోని ఆంజనేయ స్వామి మాన్యం ఎంపియుపి జిల్లా పరిషత్ పాఠశాలలో ఆయన చిత్రపటానికి పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం నాగేశ్వరరావ, నాసరయ్య, జిగురు చంద్రశేఖర్ శర్మ, మారుతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - దుర్గి

అల్లూరి సీతారామరాజు 128 జయంతి వేడుకలు దుర్గిలో శుక్రవారం ఘనంగా జరిగాయి. తహశీల్దార్ బందెల కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో సిబ్బందితో కలిసి సీతారామ రాజు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ సాల్మన్ రాజు, ఆర్ఐ యోబు, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, జూనియర్ అసిస్టెంట్ మల్లికార్జునరావు, వీఆర్వోలు కిరణ్, కోటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, పద్మావతి, గోపాల్ రెడ్డి, మూర్తి, కుమార్ స్వామి, అనిల్ శాస్త్రి, సత్యం, దళిత బహుజన సంక్షేమ సేవ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కుక్కమూడి ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్

హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక అచ్చంపేట రోడ్డులో ఉన్న టీచర్ మస్తాన్ వలి ఐటిఐలో ఆదర్శ మూర్తులు అయిన అల్లూరి సీతారామారాజు జయంతి , స్వామీ వివేకానంద వర్ధంతి కార్యక్రమాలు శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా హెల్ప్ ఫౌండేషన్ అధ్యక్షులు కంచెర్ల బుల్లిబాబు మాట్లాడారు. అనంతరం వారి ఇరువురి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మస్తాన్ ఐటిఐ ప్రిన్సిపాల్ రమేష్ బాబు, సంస్థ సభ్యులు శ్రీలత, ట్రైనర్ శ్రావణి, విద్యార్థులు పాల్గొన్నారు.

సంస్కరణలతోనే సుపరిపాలన : ఎమ్మెల్యే జూలకంటి

ప్రజాశక్తి - వెల్దుర్తి

కూటమి ప్రభుత్వం ఏడాది సుపరిపాలనలో సంస్కరణలకే అధిక ప్రాధాన్యత ఇస్తూ ముందుకు అడుగులు వేస్తుందని మాచర్ల శాసన సభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. మండలంలోని మండాది గ్రామంలో సుపరిపాలనలో తొలిఅడుగు- ఇంటింటికి టీడీపీ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో లక్షల కోట్ల నిధులతో అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు అందజేస్తున్నారని ఆయన వివరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జూలకంటి



ప్రజలతో మాట్లాడుతున్న కొమ్మాలపాటి

ఉన్నత విలువలు పాటించిన మహనేత కొణిజేటి రోశయ్య


ప్రజాశక్తి - మాచర్ల రూరల్

ఉన్నత విలువలు పాటించిన మహనేత స్వర్గీయ కొణిజేటి రోశయ్య అని మున్సిపల్ మాజీ చైర్మన్ పోలూరి నరసింహారావు అన్నారు. రోశయ్య 92వ జయంతిని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రోశయ్య కాంస్య విగ్రహనికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.కార్యక్రమంలో నాయకులు కంభంపాటి అనిల్‌కుమార్, చంటి, కజ్జం సైదయ్య, సూరె యల్లమంద, భవనాశి వెంకటేశ్వర్లు , పోలా సత్యనారాయణ, తిరువీధి నాగేశ్వరరావు, దారివేముల రామక్రిష్ణ, వంశీక్రిష్ణ, కంభంపాటి అమర్, చీదేళ్ళ ఆంజనే యులు, ఖండే శివపార్వతి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్

రోశయ్య జయంతి వేడుకలు శుక్రవారం పట్టణం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ చైర్మన్లు యెల్లినేడి రామస్వామి, కొల్లిపొర కాశీ విశ్వనాథ్ ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు టిడిపి రాష్ట్ర కార్యదర్శి చౌట శ్రీనివాసరావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.





మాచర్ల, సత్తెనపల్లిలో రోశయ్య విగ్రహానికి నివాళుర్పిస్తున్న స్థానికులు

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నరసరావుపేట పట్టణంలోని 4, 5 వార్డులలో టిడిపి నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కొమ్మాలపాటి మాట్లాడారు. రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేసి గర్వంగా ప్రజల్లోకి వెళుతున్నామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర డాక్టర్ సెల్ ఉపాధ్యక్షులు కడియాల వెంకటేశ్వరరావు, పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్టా కిరణ్, పట్టణ అధ్యక్షుడు గట్టుపల్లి సత్యనారాయణ,టిడిపి సీనియర్ నాయకులు కొల్లి బ్రహ్మయ్య, వాసిరెడ్డి రవి, మన్నం షరీఫ్, షేక్ మీరావాలి, సుబ్బరాయ గుప్తా, షేక్ రఫీ గొట్టిపాటి జనార్దన్ బాబు, కుమ్మెత కోటిరెడ్డి, శ్రీ రామినేని ప్రసాద్, వడ్లమూడి కిషోర్, కందం నాగజ్యోతి, ఉడతా రాజ్యలక్ష్మి, నర్రా రజిని, మొగిలిపువ్వు నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


విత్తన దుకాణాలు తనిఖీ చేస్తున్న వ్యవసాయ అధికారి సుగుణ

అనుమతి లేని విత్తనాలు అమ్మితే చర్యలు

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

అనుమతి లేని విత్తనాలు అమ్మితే చర్యలు తీసుకుంటామని ప్రత్తిపాడు మండల వ్యవసాయ అధికారి సుగుణ బేగం దుకాణ దారులను హెచ్చరించారు. శుక్రవారం ఆమె ప్రత్తిపాడు, గొట్టిపాడులలో విత్తన దుకాణాలను తనిఖీ చేశారు. దుకాణా దారులు విత్తన డీలర్ల లైసెన్స్, ఇన్ వాయిస్ లు, స్టాక్ రిజిస్టర్, బిల్ బుక్స్, తనిఖీ చేశారు. విత్తన డీలర్లు కొనుగోలు బిల్లు తప్పనిసరిగా రైతులకు అందజేయాలని సూచించారు. స్టాక్ బోర్డు, ప్రైస్ బోర్డు, ఎప్పటికప్పుడు ప్రతిరోజూ ధరల సూచిక బోర్డు పెట్టాలని అన్నారు. అనుమతులు ఉన్న విత్తనాలను మాత్రమే రైతులకు అమ్మాలని తెలిపారు.

మంగళగిరికి చేరిన పాదయాత్ర

ప్రజాశక్తి - మంగళగిరి

కాపులను బీసీలలో చేర్చాలని డిమాండ్ చేస్తూ సాన ప్రసాద్ చిత్తూరు నుండి అమరావతి వరకు పాదయాత్ర చేపట్టారు. ఈ పాదయాత్ర శుక్రవారం మంగళగిరి చేరుకుంది. ఈ సందర్భంగా ఆయనకు మంగళగిరి నియోజకవర్గ జనసేన పార్టీ సీనియర్ నాయకులు తిరుమల శెట్టి కొండలరావు ఘన స్వాగతం పలికారు. ప్రసాద్‌ని అభినందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో అప్పికట్ల వెంకటరత్నం నాయుడు, బాలకృష్ణ, గాదె నాగేంద్ర, వెంకట్రావు, మొహమాటం అనిల్ బాబు, పోతన చిరంజీవి, రాఘవయ్య, యుగంధర్ , గురునాథం సాన ప్రసాద్‌ని అభినందించిన వారిలో ఉన్నారు.


శివాలయంలో అన్నదానం చేస్తున్న ప్రతినిధులు

శివాలయం వద్ద అన్నదానం...

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి వారి దేవస్థానం వద్ద శివాలయంలో అర్చకునిగా పని చేసిన స్వర్గీయ బూర్గుల శంకర శాస్త్రి ప్రథమ వర్ధంతి సందర్భంగా శివ భక్త బృందం ప్రతినిధులు వల్లంశెట్టి విజయ్ కుమార్, శ్రీమతి నాగమణి దంపతుల ఆధ్వర్యంలో శుక్రవారం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో శివాలయం మాజీ ట్రస్ట్ బోర్డ్ సభ్యులు అన్నపురెడ్డి రామకతృష్ణారెడ్డి, భక్త బృందం ప్రతినిధులు పెద్దపూడి శ్రీనివాసరావు, కోసూరి రవి, వల్లంశెట్టి గురు ప్రసాద్, చెన్నం పానకాలరావు, భవాని పలువురు పురోహితులు తదితరులు పాల్గొన్నారు.

లైసెన్స్ ఉన్న దుకాణాల్లోనే విత్తనాలు కానుగోలు చేయాలి

ప్రజాశక్తి - చేబ్రోలు


రికార్డులు పరిశీలిస్తున్న ప్రియదర్శిని

శుక్రవారం చేబ్రోలు లోని విత్తన దుకాణాలను మండల వ్యవసాయ అధికారి పి.ప్రియదర్శిని తనిఖీ చేశారు. అధీకృత మూలం (ఆథరైజ్ డీలర్లు) దుకాణాల తనిఖీలో విత్తన నమూనాను సేకరించినట్లు తెలిపారు. నాణ్యత పరిశీలిం చేందుకు సంబంధిత విత్తన పరీక్ష కేంద్రానికి పంపించామని చెప్పారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు విత్తన కొనుగోలు చేసినప్పుడు దుకాణదారుడు విధిగా రైతుకు సంబంధిత బిల్లుని తప్పని సరిగా ఇవ్వాలని అన్నారు. ఆథరైజ్డ్ సోర్స్ (లైసెన్స్ ఉన్న దుకాణం) నుండి మాత్రమే రైతులు విత్తనాన్ని కొనుగోలు చేయాలని తెలిపారు. విత్తన చట్టం 1983కి లోబడి వ్యాపారాలు చేయాలని విత్తన డీలర్లకు ఆదేశాలు జారీ చేశారు.

ఆశ వర్కర్లకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలి

ప్రజాశక్తి - మంగళగిరి


మాట్లాడుతున్న సిఐటియు పట్టణ కార్యదర్శి బాలాజీ

ఆశ వర్కర్లను కార్మికులుగా గుర్తించి కనీస వేతం రూ.26వేలు ఇవ్వాలని సిఐటియు పట్టణ కార్యదర్శి బాలాజీ డిమాండ్ చేశారు. స్థానిక ఇందిరానగర్ పిహెచ్‌సిలో ఆశ వర్కర్ల సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సమావేశంలో సిఐటియు పట్టణ కార్యదర్శి బాలాజీ మాట్లాడుతూ ఈనెల 9న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. ఆయన మాట్లాడుతూ ఆశాలపై పని భారం అధికంగా పెరుగుతుందని, అదనపు పని భారాన్ని తగ్గించాలని, జనాభా ప్రాతిపదికన ప్రతి వెయ్యి మందికి ఒక ఆశా వర్కర్ చొప్పున కొత్త నియామకాలు చేపట్టాలని కోరారు. ఆశాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన పి హెచ్ సి కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

దోమల నిర్మూలన అందరి బాధ్యత


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సుభాష్ రమాదేవి

ప్రజాశక్తి - తెనాలి

దోమల నిర్మూలన అందరి బాధ్యత అని వైద్యాధికారిణి డాక్టర్ డి.సుభాష్ రమాదేవి అన్నారు. స్థానిక ఐతానగర్ లింగారావు సెంటర్ ఎన్ఎస్ఎస్ఎమ్ హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయిని ఎస్.రాజ్యలక్ష్మి సహకారంతో పాఠశాల విద్యార్థులకు దోమల నిర్మూలనపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ డి.సుభాష్ రమాదేవి మాట్లాడుతూ ముఖ్యంగా డెంగ్యూ జ్వరం ఆర్బో వైరస్ వలన వస్తుందని, ఒకరి నుంచి ఒకరికి ఎడిస్ దోమ కాటు వలన వ్యాపిస్తుందని తెలిపారు. ఈ దోమలు వర్షపు నీరు, మంచినీటిలో పెరుగుతాయని, పగలే కుడతాయని చెప్పారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో సంప్రదించి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకుని, వైద్యుల సలహా మేరకు మందులు వాడాలన్నారు. దోమల నియంత్రణ చర్యలను వివరించారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారులు వి.పున్నారెడ్డి, ఎస్.ఉమాకాంత్, ఎం.బాలచంద్రమౌళి సిబ్బంది పాల్గొన్నారు.

దేవాదాయ భూములను కాపాడాల్సిన బాధ్యత కార్యనిర్వహణాధికారులదే

ప్రజాశక్తి - పెదకాకాని


సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

దేవాదాయ భూములను కాపాడాల్సిన బాధ్యత కార్యనిర్వహణాధికారులదేనని ప్రాంతీయ సంయుక్త కమిషనర్ ఎస్.ఎస్.చంద్రశేఖర్ ఆజాద్ అన్నారు. స్థానిక మల్లేశ్వర స్వామి దేవస్థానంలో దేవాదాయ భూముల పరిరక్షణ సమీక్షా సమావేశం శుక్రవారం జరిగింది. ఆజాద్ మాట్లాడుతూ దేవాదాయ భూములను పరిరక్షించు కోవాలన్నారు. ఈ సందర్భంగా పలు దేవస్థానాల కార్యనిర్వహణ అధికారులు విధుల్లో తాము ఎదుర్కొంటున్న ఆసౌకర్యాన్ని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జోన్ దేవాదాయ శాఖ ఉప కమిషనర్ కె.బి.శ్రీనివాసరావు, పెదకాకాని శివాలయం ఉప కమీషనర్ గోగినేని లీలా కుమార్, గుంటూరు జిల్లా సహాయ కమీషనర్ జి.మాధవి, పల్నాడు జిల్లా డిఇఓ అచ్యుత్, సహాయ కమిషనర్లు టి.సుభద్ర, కె.రేఖ రెండు జిల్లాల కార్యనిర్వహణాధికారులు, మేనేజర్లు పాల్గొన్నారు.

పేద ప్రజల గుండె చప్పుడు వంగవీటి మోహనరంగా

ప్రజాశక్తి - తాడేపల్లి

పేదల గుండె చప్పుడు వంగవీటి మోహనరంగా అని వైసిపి పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాలస్వామి రెడ్డి అన్నారు. వంగవీటి మోహనరంగా జయంతి శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా తాడేపల్లి పట్టణం, మహానాడులోని వైఎస్సార్, వంగవీటి మోహన్ రంగ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, రంగా అభిమానులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మంగళగిరి

మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ వంగవీటి మోహనరంగా పేద ప్రజల గుండెచప్పుడు అని జనసేన పార్టీ మంగళగిరి నియోజకవర్గ నాయకులు చిట్టెం అవినాష్ అన్నారు. రంగా జయంతి ఘనంగా నిర్వహించారు. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట గల రంగా విగ్రహానికి జనసేన పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో దినేష్, సుభాని, దుర్గారావు, గోపి, నాగుల్ తదితరులు పాల్గొన్నారు.

మంచిని ప్రజలకు తెలిపేందుకే తొలి అడుగు కార్యక్రమం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పాలనలో చేసిన మంచిని ప్రజలకు తెలిపేందుకే తొలి అడుగు కార్యక్రమం నిర్వహిస్తున్న శాసన మండలి సభ్యులు ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. శుక్రవారం స్థానిక 22, 23 వార్డులు, సంఘం జాగర్లమూడి గ్రామాల్లో గడపగడపకు తిరిగి ప్రజాస్యాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆలపాటి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో నిర్వీర్యమైన ప్రజాసమస్యలపై గళం విప్పాలని ప్రజలకు సూచించారు. పారదర్శకమైన పాలన అందించడానికి తొలి అడుగు కార్యక్రమాన్ని చేపట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో టిడిపి కార్యకర్తలు నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

హత్యా రాజకీయాలకు పొన్నూరులో తావులేదు : టిడిపి నాయకులు

ప్రజాశక్తి - పొన్నూరు

హత్యా రాజకీయాలకు పొన్నూరులో తావులేదని తెదేపా నాయకులు పేర్కొన్నారు. స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ శవ రాజకీయాలకు ఆద్యులు వైకాపా వాళ్లేనని వారు పేర్కొన్నారు. నిన్న జరిగిన ఘటన యాధృచ్ఛికంగా ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన దాడికి రాజకీయరంగు పులిమి శవరాజకాలు చేస్తున్న వైకాపా నాయకులు వాస్తవాలు తెలుసుకుంటే మంచిదని వారు హితవు పలికారు. మా నాయకులు ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ పై అసత్య నేరారోపణలు చేస్తే సహించేదిలేదని హెచ్చరించారు. సమావేశంలో పొన్నూరు నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు ఎద్దు సోంబాబు, ఎస్సీ సెల్ అధ్యక్షులు తోటకూర నరేష్, బెనర్జీ తదితరులు పాల్గొన్నారు.


విజయవాడ ధర్నాకు తరలివెళుతున్న ఇంజనీరింగ్ కార్మికులు

ధర్నాకు తరలివెళ్లిన ఇంజనీరింగ్ కార్మికులు

ప్రజాశక్తి - మంగళగిరి

మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం విజయవాడలో జరిగే ధర్నాకు మంగళగిరి మున్సిపల్ కార్మికులు తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎం.బాలాజీ, యు.దుర్గారావు, ఎం.శ్రీనివాసరావు, కె.శ్రీనివాస రావు, కె.కేధార్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ చీఫ్ ఆడిట్ ఆఫీసర్‌గా అందె వెంకటేశ్వరావు

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరికి చెందిన అందె వెంకటేశ్వరావును టీటీడీ చీఫ్ ఆడిట్ అధికారిగా నియమిస్తూ ప్రిన్సిపల్ సెక్రటరీ పీయూష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. పేద చేనేత కార్మిక కుటుంబంలో జన్మించిన వెంకటేశ్వరరావు చిన్నతనం నుంచి మగ్గం నేస్తూ ఉన్నత విద్యను అభ్యసించారు. అందె వెంకటేశ్వరావును టీటీడీ చీఫ్ ఆడిట్ అధికారిగా నియమించడం పట్ల నగరానికి చెందిన పలువురు ప్రముఖులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.


ఏపిఎస్పీ బెటాలియన్‌లో జరిగిన మెగా ఉచిత మెడికల్ క్యాంపు

మెగా ఉచిత మెడికల్ క్యాంపు

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి ఏపిఎస్పీ ఆరో బెటాలియన్‌లో శుక్రవారం మెగా ఉచిత మెడికల్ క్యాంప్ జరిగింది. ఈ కార్యక్రమానికి ఏపిఎస్పీ ఆంధ్ర ప్రదేశ్ బెటాలియన్స్ ఐజిపి బి.రాజకుమారి పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ మెడికల్ క్యాంపులను సద్వినియోగం చేసుకొని ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమాండెంట్ కె.నగేష్ బాబు, అడిషనల్ కమాండెంట్ డి.ఆశీర్వాదం, వెంకటేశ్వర్లు, ఏపిఎస్పీ క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు. శిబిరంలో వివిధ రకాల వైద్య నిపుణులు పాల్గొని పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు.


ఎస్ఐ నాగేంద్రకి ఫిర్యాదు చేస్తున్న వైసిపి నాయకులు

బాలసాని కిరణ్‌పై అసభ్యంగా మాట్లాడిన వారిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

ప్రత్తిపాడు నియోజక వర్గ ఇంచార్జ్ బాలసాని కిరణ్ కుమార్‌పై సోషల్ మీడియాలో అసభ్య పదజాలం వాడుతూ దళితుల మనోభావాలు దెబ్బతినేలా మాట్లాడిన మేదరమెట్ల సురేష్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వైసిపి నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు నల్లపాడు, వట్టిచెరుకూరు, ప్రత్తిపాడు, పెదనందిపాడు, కాకుమాను స్టేషన్లలో ఆ పార్టీకి చెందిన నాయకులు కార్యకర్తలు శుక్రవారం ఫిర్యాదు చేశారు.

రోశయ్య ఘన నివాళులు

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

ఏపి మాజీ సిఎం కొణిజేటి రోశయ్య 92 జయంతి వేడుకలు శుక్రవారం ప్రత్తిపాడులో ఆర్యవైశ్య సంఘ నేతలు ఘనంగా నిర్వహించారు. అనంతరం రోశయ్య చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మట్ల వెంకటేశ్వర్లు, సూర్య లక్ష్మీనారాయణ, దోగుపర్తి శ్రీనివాసరావు, బంధం వెంకట్రావు, అరవపల్లి వెంకటేశ్వరావు, గ్రంధి వెంకట రమణ, మద్ది రవి తదితరులు పాల్గొన్నారు.

బీఈడీ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పరిధిలో మార్చి, మే నెలల లో జరిగిన బీఈడీ మొదటి సెమిస్టర్, స్పెషల్ బీఈడీ మొదటి సెమిస్టర్ ఫలితాలను విడుదల చేసినట్లు పరీక్షల నిర్వహణ అధికారి ఆలపాటి శివప్రసాద్ శుక్రవారం తెలిపారు. రీ వ్యాల్యూయేషన్ కు ఈ నెల 14వ తేదీ లోపు ఒక్కొక్క పేపర్ కు రూ. 1860 లు చొప్పున చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు.



నోటు పుస్తకాలు అందజేస్తున్న మాజేటి ప్రసాద్ తదితరులు

బాపూజీ విద్యా సంస్థల్లో నోటు పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక సంగడిగుంటలోని బాపూజీ విద్యాసంస్థలలో కర్పూరపు పార్వతమ్మ 50వ వర్ధంతి సందర్భంగా వారి కుటుంబ సభ్యులు రూ.1 లక్ష విలువ చేసే మూడువేల నోటు పుస్తకాలను శుక్రవారము కళాశాలలో విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బాపూజీ కమిటీ కోశాధికారి మాజేటి ప్రసాద్ పాల్గొని మాట్లాడుతూ కర్పూరపు వారి కుటుంబ సభ్యులు ఇంత పెద్ద మొత్తములో నోటు పుస్తకాలను పంపిణీ చేయడం అభినందనీయమని, విద్యార్థులు కూడా బాగా చదువుకుని ఉన్నత స్థితికి చేరాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో బాపూజీ కమిటీ గౌరవాధ్యక్షులు గుంటూరు సత్యనారాయణ మాట్లాడుతూ దాతలు కర్పూరపు రామకృష్ణ ప్రభు, కర్పూరపు సూర్యనారాయణను ప్రత్యేకంగా అభినందించారు.అనంతరం దాతలను సన్మానించారు. కార్యక్రమంలో డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ మహంకాళి శ్రీనివాసరావు సుభద్ర, కవిత అధ్యాపకులు పాల్గొన్నారు.

చలమయ్య కాలేజిలో అల్లూరి జయంతి : కళాశాలలో శుక్రవారం అల్లూరి సీతారామరాజు జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపనటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ప్రిన్సిపాల్ మహంకాళి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎన్.ఎస్.ఎస్. అధికారులు ఎ.శ్రీధర్, వై.చంద్రశేఖర్ అధ్యాపకులు భవానీదుర్గ, హరిలాల్ తదితరులు పాల్గొనఆనరు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్, వక్తృత్వ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుతులు అందచేశారు.



9న సమ్మెలో ఆటో డ్రైవర్లు పెద్ద సంఖ్యలో పాల్గొనాలి

ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు నన్నపనేని శివాజీ

ప్రజాశక్తి-గుంటూరు

దేశ వ్యాప్తంగా జులై 9న జరిగే సార్వత్రిక సమ్మెలో ఆటో డ్రైవర్లు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు నన్నపనేని శివాజీ పిలుపునిచ్చారు. శుక్రవారం పాత గుంటూరులోని సిఐటియు జిల్లా కార్యాలయంలో జిల్లా ఆటో డ్రైవర్స్ యూనియన్ జిల్లా కమిటీ సమావేశం బి.లక్ష్మణరావు అధ్యక్షతన నిర్వహించారు. శివాజీ మాట్లాడుతూ లేబర్ కోడ్‌లు, న్యాయ సన్నిహిత బిఎన్ఎస్ 106(1) 2 సెక్షన్ రద్దు చేయాలని, మోటార్ వాహనాలపై పెంచిన అన్ని రకాల పెనాల్టీలు, ఫీజులు, ఇన్సూరెన్స్ ప్రీమియం, పెట్రోలు, డీజిల్ ధరలు, టోల్ ట్యాక్స్‌లు, గ్రీన్ ట్యాక్స్‌లు తగ్గించాలని తదితర డిమాండ్లతో సమ్మె చేస్తున్నట్లు చెప్పారు. ఉన్నత చదువులు చదివినా ఉద్యోగాలు లేక, డ్రైవింగ్ వృత్తిద్వారా ఉపాధి పొందుతున్న వారికి చిన్న చిన్న పొరపాట్లకు భారీగా జరిమానాలు, జైలు శిక్ష విధించే విధంగా న్యాసంహిత బిఎన్ఎస్ 106(1) 2 సెక్షన్ తీసుకొచ్చారన్నారు. దీని వల్ల ఏదైనా వాహనం ప్రమాదానికి గురి అయ్యి మనిషి చనిపోతే ఎఫ్ఐఆర్‌లో వాహనం నిర్లక్ష్యంగా నడిపాడు అనిగానీ, ప్రమాదం స్థలం నుండి డ్రైవర్ పారిపోయాడనిగానీ నమోదైతే డ్రైవర్‌కు 10 ఏళ్ల జైలు, రూ.10లక్షల జరిమానా విధిస్తారన్నారన్నారు. ఇటువంటి దారుణమైన విధానాలు విడనాడాలన్నారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు బి.లక్ష్మణరావు మాట్లాడుతూ గత ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెంబర్ 21ని తాము అధికారంలోకి వస్తే సవరిస్తానని, పెంచిన అన్ని రకాల ఫీజులు, పెనాల్టీలు, గ్రీన్‌టాక్స్ తగ్గిస్తానని డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు, వాహన కొనుగోలుకి బ్యాంకుల ద్వారా రూ.4 లక్షలు సబ్సిడీతో కూడిన రుణాలు ఇస్తామని అనేక హామీలు ఇచ్చి ఏడాది అవుతున్నా అమలు చేయలేదన్నారు. మరోవైపు టోల్ రేట్లు పెంచడం, పిపిపి విధానంలో జిల్లా రహదారుల్లోనూ టోల్ ఛార్జీలు వసూలు చేస్తామని ప్రకటించటం దారుణం అన్నారు. సమావేశంలో షేక్ మస్తాన్వలి, సిఐటియు నగర కార్యదర్శి కె. శ్రీనివాస్, ఆటో యూనియన్ నగర కార్యదర్శి జి.శంకర్, ఎస్.కె షమీముల్లా, నాగరాజు, జి.రవివర్మ, మహమ్మద్ సాహెబ్, పిట్టల రవి తదితరులు పాల్గొన్నారు

మాట్లాడుతున్న శివాజీ



పారిశుధ్యం మెరుగుదలకు పటిష్ట చర్యలు : కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరంలో జులై నెలాఖరు నాటికి ప్రజలు మెచ్చేలా పారిశుధ్యాన్ని అందించేందుకు నగర పరిధిలోని 3 నియోజకవర్గాల వారీగా ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేస్తున్నామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం జిఎంసి కౌన్సిల్ సమావేశ మందిరంలో గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవితో కలిసి, పశ్చిమ నియోజక వర్గంలో కార్పొరేటర్లు, ప్రజారోగ్య కార్యదర్శులు, ఇన్స్పెక్టర్లతో పారిశుధ్యం మెరుగుదల కోసం ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ జిఎంసి పరిధిలోని 57 ఎలక్షన్ వార్డులలో శానిటరీ డివిజన్లు ఏర్పాటు చేస్తూ, అక్కడ కావాల్సిన కార్మికులు, పుష్‌కాట్స్, ట్రాక్టర్లు, ఇతర వస్తువుల కేటాయింపు చేసి, మ్యాపింగ్ చేస్తున్నామన్నారు. సమీక్షలో కొన్ని డివిజన్లలో కార్మికుల కొరత, డెప్యుటేషన్లు, సరిపడా పుష్ కాట్స్, వస్తువులు లేకపోవడం గుర్తించామన్నారు. వాటిని త్వరలోనే అందిస్తామని చెప్పారు. రానున్న నెల రోజుల కాలంలో కమాండ్ కంట్రోల్ రూమ్‌ని సిద్ధం చేసుకొని, నగరంలో ప్రతిఇంటి గేటుకు ఆర్ఎఫ్ఐడి ట్యాగ్‌లు ఏర్పాటు చేసి నూరు శాతం ఇంటింటి చెత్త సేకరణ చేసేలా ఏఐ టెక్నాలజీ ద్వారా పర్యవేక్షణ చేస్తామని తెలిపారు.ఎమ్మెల్యే మాదవి మాట్లాడుతూ పశ్చిమ నియోజకవర్గాన్ని పర్యావరణహిత, పరిశుభ్ర నియోజకవర్గంగా తీర్చిదిద్దుకోవడానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు కృషి చేస్తామన్నారు. ప్రస్తుతం నగరంలో పారిశుధ్య సమస్య తీవ్రంగా కనిపిస్తుందని, ఈ నేపథ్యంలో కమిషనర్ నియోజకవర్గాల వారీగా అధికారులు, డివిజన్ల కార్పొరేటర్లతో సంయుక్త సమావేశం ఏర్పాటు చేసి సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై చర్చించడం జరిగిందన్నారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ సిహెచ్.శ్రీనివాస్, సిఎంఓహెచ్ డాక్టర్ అమతం, ఎంహెచ్ఓల (ఇంచార్జి) సోమశేఖర్, ఎస్ఎస్‌లు ప్రసాద్, రాజేష్, కార్పోరేటర్లు, ఇన్స్పెక్టర్లు, కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

కొత్త పింఛన్లు ఎప్పుడు ఇస్తారు?

ఎమ్మెల్యే గల్లా మాధవికి ప్రజల నుండి ప్రశ్నలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గత రెండేళ్లుగా కొత్తగా పింఛన్లు మంజూరు చేయడం లేదని కొత్త పింఛన్లు ఎప్పుడు ఇస్తారని పలువురు అర్హత కలిగిన వృద్ధులు, వితంతువులు టిడిపి నాయకులను ప్రశ్నించారు. శుక్రవారం 30వ డివిజన్ ఏటి అగ్రహారం 12వ లైన్ నుండి సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఇంటింటికి తిరిగి సంవత్సర కాలంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం చేసిన సంక్షేమాన్ని, అభివద్ధిని వివరిస్తూ రూపొందించిన కరపత్రాన్ని ప్రజలకు అందజేసి, వారి నుండి ప్రభుత్వ పాలన తీరు పై అభిప్రాయాలు, సలహాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలను ఆమె విన్నారు. వైసిపి హయంలో 2023లోనే పింఛన్లు నిలిపివేశారని, కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది దాటినా కొత్త పింఛన్లు ఇవ్వడం లేదని వీటిని ఎప్పుడు ఇస్తారని ప్రశ్నించారు. గత వైసిపి ప్రభుత్వ నేతలు, కొంతమంది సచివాలయ ఉద్యోగులను అడ్డం పెట్టుకొని ఇష్టానుసారంగా పెన్షన్లను దోచేశారని, అర్హత కలిగిన లబ్ధిదారులకు వివిధ కారణాలను చూపుతూ పెన్షన్ తీసివేశారు అన్నారు. త్వరలోనే వీటిని పరిశీలించి అర్హులైన ప్రతి ఒక్కరికి పెన్షన్ ఏ విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దష్టికి తీసుకెళ్తామన్నారు. తమ ప్రభుత్వం వైసిపి కన్నా రెట్టింపు సంక్షేమాన్ని తమ ప్రభుత్వం అందించిందని ఆగస్టు 15 నుండి ఉచిత బస్సు ప్రయాణాన్ని కూడా అందించబోతున్నామని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డేగల ప్రభాకర్, సింహాద్రి కనకాచారి, మానుకొండ శివప్రసాద్, కనపర్తి శ్రీనివాసరావు కోరంగి శ్రీనివాసరావు, పేరం అనిత, దూదేకుల షాహిద్ బాబు, ముత్తునేని రాజేష్, పోరెళ్ళ



హర్యానా అసెంబ్లీ స్పీకర్‌ను కలిసిన మేయర్ రవీంద్ర

ప్రజాశక్తి-గుంటూరు

హర్యానాలోని గురుగ్రామ్‌లో ఈనెల 3, 4 తేదీల్లో 'నేషనల్ లెవల్ కాన్ఫరెన్స్ ఆఫ్ చైర్‌పర్సన్స్ ఆఫ్ అర్బన్ లోకల్ బాడీస్' సమావేశానికి హాజరైన గుంటూరు నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, హర్యానా రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ హర్విందర్ కళ్యాణ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. సదరు కాన్ఫరెన్స్‌లో స్థానిక సంస్థలలో రాజ్యాంగ ప్రజాస్వామ్యం, జాతి నిర్మాణంలో పట్టణ స్థానిక సంస్థలపాత్ర అనే అంశంపై రెండ్రోజులపాటు వివిధ రాష్ట్రాల నుండి హాజరైన మేయర్లు డిప్యూటీ మేయర్లకు హర్యానా స్పీకర్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారని తెలిపారు.



మాట్లాడుతున్న సత్యనారాయణ

ఉన్నత వ్యక్తిత్వానికి ప్రతీక రాధాకృష్ణమూర్తి

ప్రజాశక్తి-గుంటూరు

హిందూ కళాశాల పాలకమండలి అధ్యక్షులుగా, న్యాయవాదిగా, ఆధ్యాత్మిక తత్వవేత్తగా మాధవపెద్ది రాధాకృష్ణమూర్తి ఉన్నత వ్యక్తిత్వానికి ప్రతీక అని ప్రపంచ ఆర్థికసంస్థ సలహాదారు జి. సత్యనారాయణ అన్నారు. శుక్రవారం స్థానిక హిందూ కళాశాలలో కళాశాల పూర్వ అధ్యక్షులు మాధవ పెద్ది రాధాకృష్ణమూర్తి శత జయంతోత్సవాలు ఘనంగా నిర్వహించారు. హిందూ కాలేజి, హైస్కూల్ అధ్యక్షులు జి.శివరామకృష్ణ అధ్యక్షత వహించారు. సత్యనారాయణ మాట్లాడుతూ రాధాకృష్ణమూర్తి సేవలు వర్తమాన, భవిష్యత్ తరాలకు, కళాశాల పురోభివృద్ధికి మార్గదర్శకంగా ఉంటాయన్నారు. మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ 8 దశాబ్దాలకుపైగా చరిత్ర కలిగిన హిందూ కాలేజిని విలువలతో నిర్వహించటం అభినందనీయం అన్నారు. కళాశాల పూర్వకార్యదర్శి డాక్టర్ మన్నవ రాధాకృష్ణమూర్తి, కళాశాల కార్యదర్శి చెరువు రామకృష్ణమూర్తి ప్రసంగించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణమూర్తి కుటుంబ సభ్యులు రూ.5 లక్షల విరాళాన్ని కౌన్సిల్ అధ్యక్ష, కార్యదర్శులకు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కెవిఎస్ దుర్గాప్రసాద్, జూపూడి రంగరాజు, కౌన్సిల్ కార్యదర్శి కె.ఎస్.ఆర్ కుటుంబరావు, ఎం.వి.ఆర్.కె. ముత్యాలు, మాధవపెద్ది మీరా శేఖర్, రమణి ప్రసాద్, చైతన్య, అపర్ణ తదితరులు పాల్గొన్నారు.